మా అక్షరాలు - నిజాల నిప్పు కణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 29 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# రైతులు ఆత్మహత్య చేసుకున్నారా!

## - వివరాలు ఇవ్వండి.. నష్టపరిహారం ఇస్తాం



- కేసీఆర్ పొలంబాట పట్టడం సంతోషకరం
- ఆయనకు కరువు ఎప్పుడు వస్తుందో తెలియదా?
- వేలాది పుస్తకాలు చదివినా తెలియకపోవడం ఆశ్చర్యమే
- పదేళ్ల తరవాత రైతులు గుర్తుకు వచ్చారా !
- పదేళ్ల కెసిఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగింది
- తుక్కుగూడ సభలో జాతీయ మేనిఫెస్టో విడుదల
- ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** వేలాది పుస్తకాలు చదివిన పెద్దమనిషి కెసిఆర్‌కు కరువు ఎలా వస్తుందో పుస్తకాల్లో చదవలేదా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే కరువు పేరుతో రైతుల వద్దకు వెళ్లడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. పదేళ్ల తరువాత కేసీఆర్‌కు రైతులు గుర్తుకు వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ కరువు తెచ్చిందని అంటున్నారని, కరువు ఎలా వస్తుందో తెలియదా అని అన్నారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ లో కేసీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పరిస్థితి చూసి సానుభూతి తేలియజేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని కేసీఆర్ అంటున్నారని .. వర్షాలు ఎప్పుడు పడ్డాయో చెప్పాలన్నారు. వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ కు కరువు ఎప్పుడు వస్తుందో తెలియదా అని సీఎం ప్రశ్నించారు. తుక్కుగూడలో ఈనెల 6వ తేదీన ఏఐసీసీ భారీ బహిరంగ సభకు ఎ÷-లాన్ చేసిందని.. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు తుక్కుగూడ సభా ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మంత్రులు పరిశీలించారు. సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నిర్వాహకులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా వందశాతం పనిచేయాలని, ఆయన చేసిన సూచనలను ప్రభుత్వం స్వీకరిస్తుందని తెలిపారు. 200 మంది రైతులు చనిపోయారని కేసీఆర్ అంటున్నారని.. నిజంగా చనిపోతే వివరాలు ఇస్తే నష్టపరిహర ఇచ్చి రైతులను అదుకుంటామని రేవంత్ ప్రకటించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ విధ్వంసానికి గురైందని ఆరోపించారు. కాంగ్రెస్ కు తెలంగాణ ప్రత్యేక స్థానం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తుక్కుగూడ జన జాతర సభకు ఖర్గే, రాహుల్, ప్రియాంక, ముఖ్య నేతలంతా వస్తున్నారని చెప్పారు. ఈ సభలో జాతీయ ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేస్తామని తెలిపారు. అదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని సీఎం కోరారు. గతంలో ఆరు గ్యారంటీలను తుక్కగూడ సభలోనే ఇచ్చామని.. అందులో 5 గ్యారెంటీలను అమలు చేశామన్నారు. తెలంగాణ నుంచి నేషనల్ మేనిఫెస్టో రిలీజ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ కు తెలంగాణ కంచుకోట అని నిరూపిస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఈ సభలో మహిళలకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను తెలంగాణలో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల కోడ్ రావడంతో పథకాలకు కొంత అంతరాయం కలిగిందని చెప్పారు. ఎన్నికల తర్వాత మిగతా హామీలను అమలు చేస్తామని

మిగతా 2లో..

# మూడోసారి అధికారం చేపట్టాక అవినీతిని అంతమొందిస్తాం: ప్రధాని మోదీ

## - దేశంలో అగ్గిరాజేసేందుకు విపక్షం కుట్ర



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టాక అవినీతిపై మరింత కఠినంగా వ్యవహరించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. పేదలు, మధ్యతరగతి వర్గాల హక్కులను అవినీతి హరిస్తోందన్నారు. ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారానికి దూరమై నిరాశతో ఉన్న హస్తం పార్టీ, దేశ విభజనకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. అవినీతిపరులు తోటి అవినీతిపరులను రక్షించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు.: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీల నేతల మాటలు మంటలు రేపుతున్నాయి. అధికార ఎన్?డీఏ ప్రభుత్వంపై విపక్ష ఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రధాని మోదీ దీటుగా తిప్పికొట్టారు. ఉత్తరాఖండ్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రధాని మోదీ, రుద్రపుర్‌లో భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్, నిరాశతో దేశంలో అగ్గిరాజేసేందుకు కుట్ర చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు."60ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, పదేళ్లు

మిగతా 2లో..

# సుప్రీంకు పతంజలి క్షమాపణ

## - సుప్రీం ఆగ్రహం.. బేషరతుగా క్షమాపణలు చెప్పిన రామ్‌దేవ్ బాబా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసు విచారణలో భాగంగా యోగా గురువు రామ్‌దేవ్ బాబా పతంజలి ఆయుర్వేద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలక్రిష్ణ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట హాజరయ్యారు. తమ ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన కోర్టు.. చర్యలకు సిద్ధంగా ఉండాలని వారిని హెచ్చరించింది. అలాగే క్షమాపణలు తెలియజేస్తూ గత నెల పతంజలి సంస్థ దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందిస్తూ.. "మీ క్షమాపణల పట్ల మేం సంతృప్తి చెందలేదు" అని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా రామ్‌దేవ్ బాబా కోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. అయితే, అఫిడవిట్‌లో వీరు ఇచ్చిన వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన కోర్టు.. వారం రోజుల్లోగా మళ్లీ కొత్త అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచించింది. ఏప్రిల్ 10న మరోసారి న్యాయస్థానం ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య', 'తప్పుదోవ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని తేల్చిచెప్పింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణిం చాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో ఆ సంస్థ న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అయితే, ఆ హామీని ఉల్లంఘించడంపై కోర్టు ఆగ్రహం

మిగతా 2లో..



# రైతాంగ సమస్యలకు కలెక్టర్లకు భారాస వినతిపత్రం

- నీరందక ఎండుతున్న పంటలు
- ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

**జోగులాంబ గద్వాల ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** జిల్లాలో అనేక గ్రామాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని వారిని ఆదుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి , ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. చేతికొచ్చే దశలో పంటలు నష్టపోవడం రైతాంగానికి ఆందోళన కలిగిస్తున్నదని ఎమ్మెల్యేలు అన్నారు. రాష్ట్రంలో ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో కలెక్టర్ కు వినతిపత్రం ఇచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే గ్రామాల వారీగా పంటల నష్టాన్ని అంచనా వేయడానికి అధికారుల బృందాలను నియమించి

మిగతా 3లో..

# రాజకీయాలకు సిద్ధరామయ్య గుడ్ బై

## - వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని కర్ణాటక సీఎం ప్రకటన



**బెంగుళూరు ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** రాజకీయాల నుంచి విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఇక పోటీ చేయనని తేల్చి చెప్పారు. ప్రస్తుత సీఎం పదవికాలం ముగిశాక రిటైర్మెంట్ చేస్తున్నట్లు ప్రకటించారు.: కర్ణాటక సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య తన రాజకీయ భవితవ్యంపై కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత సీఎం పదవీకాలం ముగిశాక

మిగతా 2లో..

# త్వరలో మమ్మల్నీ అరెస్టు చేస్తారు

- మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు
- తిహాడ్ జైల్లో నీరసించిన కేజ్రీవాల్
- పడిపోయిన షుగర్ లెవల్స్



**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** కొద్దిరోజుల్లో మరికొందరు ఆప్ నేతలు అరెస్టు కావొచ్చని దిల్లీ మంత్రి ఆతిశీ వెల్లడించారు. ఆ పేర్లను కూడా ఆమె బయటపెట్టారు. త్వరలో మేం నలుగురం జైలుకు.. ఆతిశీ సంచలన వ్యాఖ్యలు దిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు మరో నలుగురు ఆప్ నేతలు అరెస్టవుతారని దిల్లీ మంత్రి ఆతిశీ ఆరోపించారు. వారిలో తాను కూడా ఉంటానని పేర్కొన్న ఆమె.. మిగతా ముగ్గురు సౌరభ్ భరద్వాజ్, దుర్గేశ్ పాథక్, రాఘవ్ చద్దా అని వెల్లడించారు. దిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టైన సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈడీ విచారణలో కీలక విషయాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. నిందితుడైన విజయ్ నాయర్ తన మంత్రి వర్గంలోని ఆతిశీ, సౌరభ్‌కు రిపోర్టు చేసేవాడని సీఎం పేర్కొన్నట్లు ఏఎస్‌జీ ఎస్‌వీ రాజు కోర్టుకు వెల్లడించారు. తమ పేర్లు బయటకు వచ్చిన నేపథ్యంలో ఆమె తాజాగా మీడియా సమావేశంలో సంచలన ఆరోపణలు చేశారు. "నిన్న కోర్టులో ఈడీ.. సౌరభ్, నా పేరు ప్రస్తావించింది. ఈ స్టేట్‌మెంట్ సీబీఐ, ఈడీ వద్ద ఎప్పటి నుంచో ఉంది. కానీ, దానిని ఇప్పుడు బయటపెట్టడానికి కారణం.. కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్, సత్యేంద్ర జైన్ అరెస్టు తర్వాత కూడా ఆప్ ఐక్యంగా ఉందని భాజపా భావించడమే. దాంతో వారి

మిగతా 2లో..


# డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు



**హైదరాబాద్,ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. డీఎస్సీ దరఖాస్తులకు గడువు పొడిగిస్తున్నట్లు స్కూల్‌బోర్డు స్పష్టం చేసింది. జూన్ 20 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించింది. ఇక జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 29న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలుత నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు, మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. నేటితో దరఖాస్తు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ, అందులో అర్హత సాధించిన వారికి సైతం డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించే

మిగతా 2లో..

# ప్రజా నాడి




# హార్డ్‌డిస్కులు ధ్వంసం చేసి మూసిలో పడేశారు

## - ఫోన్‌ట్యాపింగ్ కేసులో వెలుగులోకి కీలక విషయాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 2 (ప్రజామంటలు):** రాష్ట్రవ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనంగా మారితోంది. నిందితుల రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు బయటపడుతున్నాయి. హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి మూసీ నదిలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే రాధాకిషన్‌రావు కస్టడీ పిటిషన్‌పై బుధవారం నాంపల్లి కోర్టు తీర్పును వెలువరించనుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2లో..



# మల్కాజిగిరిలో బిజెపితోనే మనకు పోటీ


- కాంగ్రెస్ ఇక్కడ పోటీలో లేనట్లే
- చేవెళ్లలో రిజెక్ట్ చేసిన అభ్యర్థిని పెట్టారు
- మల్లారెడ్డి తలచుకుంటే ఇక్కడ ఘనవిజయం సాధ్యం
- నియోజకవర్గ స్థాయి సమీక్షలో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**మేడ్చల్ మల్కాజ్‌గిరి,ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో మనకు పోటీ కాంగ్రెస్‌తో కాదు.. బీజేపీతోనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మనకు కాంగ్రెస్‌తో పోటీ లేదు. కేవలం డమ్మీ అభ్యర్థిని మన ప్రాంతంతో సంబంధం లేని వ్యక్తిని నిలబెట్టారు. చేవెళ్లలో రిజెక్ట్ చేస్తే ఇక్కడ బలవంతంగా నిలబెట్టారు. ఇక్కడ మనకు పోటీ బీజేపీతోనే అని కేటీఆర్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను మళ్లీ జరగనివ్వొద్దని కేటీఆర్ సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మేడ్చల్ అంటనే మాస్.. మల్లన్న మారి మాస్.. కేతక్క కూడా సూపర్. ఆమె మాట్లాడుతుంటే మరింత వినబుద్ధి అవుతుంది. ఆమె మాట్లాడిన తర్వాత మాట్లాడాలంటే యాటకూర తిన్నాక తోటకూర తిన్నట్టు ఉంటది.

# ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్

## - 8 మంది మావోయిస్టుల మృతి



**రాయ్‌పుర్ ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భీకర ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపుర్ జిల్లాలోని దండకారణ్యంలో భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య మంగళవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులను మట్టుబెట్టినట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. బీజాపుర్ జిల్లా లెంద్రా గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం రావడంతో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ చేపట్టారు. డీఆర్‌జీ, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్పీఎఫ్, కోబ్రా కమాండ్ యూనిట్ బలగాలు ఇందులో పాల్గొన్నాయి.

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# రైతులు ఆత్మహత్యచేసుకున్నారా!

## - వివరాలు ఇవ్వండి.. నష్టపరిహారం ఇస్తాం

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల తర్వాత అయినా మాజీ సీఎం కేసీఆర్ 'పొలం బాట' పట్టడం సంతోషమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుందని అన్నారు. ఆయనకు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాపాలతోనే ఈ కరువు పరిస్థితులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆయనను పాపాల భైరవుడు అన్నా తక్కువేనని అన్నారు. ఆయన చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధును వేయడానికి 10 నెలల సమయం తీసుకుందని చెప్పారు. 65 లక్షల రైతుల ఖాతాలో తాము రైతుబంధు వేశామని.. మిగిలింది 4 లక్షల రైతులేనని ఎన్నికలు అయిపోగానే వీరికి కూడా రైతు బంధు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ మొన్నటి పర్యటనలో జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి విద్యుత్ పోయిందని తమ ప్రభుత్వంపై నిందలు వేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాము ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే తమను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాము తలుచుకుంటే కేసీఆర్ బయటకు వెళ్లేవారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1500 కోట్లు ఉన్నాయని.. రైతులకు రూ.100 కోట్లు సహాయం చేయొచ్చు కదా అని చెప్పారు. ఎంపీ ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. చనిపోయిన రైతుల వివరాలు ఇచ్చేందుకు కేసీఆర్‌కు 48 గంటల సమయం ఇస్తున్నానని అన్నారు. ఆ లోగా రైతుల వివరాలు ఇస్తే ఎన్నికల కోడ్ ముగియగానే రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కేసీఆర్ న్యాయమైన సలహాలు, సూచనలు ఇస్తే అమలు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. తాము ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి తెలంగాణ హక్కులు సాధిస్తున్నామని.. అందుకే అక్కడకు వెళ్తున్నామని అన్నారు. కేసీఆర్ కుటుంబ దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేసీఆర్ పాపాల వల్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు పారిపోతున్నారని దెప్పిపొడిచారు. ఆ పార్టీ నేతలను కాపాడుకోవడానికి కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ చెల్లని వెయ్యి రూపాయల నోటని ఎద్దేవా చేశారు. జూన్ 9వ తేదీ తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని అన్నారు. ఆ రోజే ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌లో కొత్త పథకాలను అమలు చేయడానికి అవకాశం లేకుండా పోయిందని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పథకాలను రాష్ట్రంలో అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్ని సమస్యలు ఉన్నాయని నీళ్లు ఎత్తిపోయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని... ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కుట్రకు తెరదీశాయని అన్నారు.

# మూడోసారి అధికారం చేపట్టాక అవినీతిని అంతమొందిస్తాం: ప్రధాని మోదీ

## - దేశంలో అగ్గిరాజేసేందుకు విపక్షం కుట్ర

అధికారం లేకపోయేసరికి దేశంలో అగ్గిరాజేసే వ్యాఖ్యలు చేస్తోంది. అగ్నిపెట్టాలనే మాటలు మీకు(ప్రజలకు) ఆమోదయోగ్యమేనా? ఈసారి వారిని ఎన్నికల మైదానంలో లేకుండా చేయండి. అత్యయిక పరిస్థితి విధించిన కాంగ్రెస్, ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ దేశాన్ని అస్థిరత వైపు తీసుకెళ్లాలని భావిస్తోంది. కర్ణాటకలో కాంగ్రెస్‌కు చెందిన పెద్ద నాయకుడు దక్షిణ భారత్‌ను దేశం నుంచి వేరు చేసి, రెండు ముక్కలు చేసే మాట అన్నారు. మీరు(ప్రజలు) చెప్పండి. దేశాన్ని ముక్కలు చేయాలనే వారికి శిక్షపడాలా వద్దా? కానీ కాంగ్రెస్ ఏం చేసింది. శిక్ష వేయటానికి బదులు ఎన్నికల టికెట్ ఇచ్చింది.'మోదీ వాటికి భయపడేవాడు కాదు'కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే అవినీతిపరుల పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. పేదలు, మధ్య తరగతి వర్గాల హక్కులను అవినీతి హరిస్తుందన్నారు. వారి హక్కులను ఎవరు హరించే ప్రయత్నం చేసినా, చూస్తూ ఊరుకుండే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ హెచ్చరించారు."అవినీతిపరులు మోదీని బెదిరిస్తున్నారు. 24 గంటలూ దూషిస్తున్నారు. అవినీతిని పారదోలాలని మేం అంటుంటే అవినీతిపరులను కాపాడాలని వారంటున్నారు. మీరు(ప్రజలు) చెప్పండి. అవినీతి పోవాలా వద్దా? ఇది దేశ ప్రజల మాట. మోదీ ప్రజల ప్రతి మాట వింటాడు. మోదీ వారి బెదిరింపులు, దూషణలకు భయపడేవాడు కాదు. మూడో విడతలో అవినీతిపై మరింత కఠినంగా వ్యవహరిస్తాం. ఈ మాట గ్యారంటీ ఇచ్చేందుకు వచ్చాను."ఉత్తరాఖండ్ తర్వాత రాజస్థాన్‌లోని కోట్ పుత్లీలో విజయ్ శంఖనాదం పేరుతో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ప్రధాని మోదీ, గత పదేళ్లలో జరిగిన పనులన్నీ ట్రైలర్ మాత్రమే అని అన్నారు. అసలు సినిమా ఇంకా ఉందని చెప్పారు. మోదీ వినోదం కోసం జన్మించలేదు. మోదీ కష్టపడి పనిచేందుకు పుట్టాడు. ఎంతో జరిగి ఉండొచ్చు. కానీ పదేళ్లలో జరిగినదంతా కేవలం ట్రైలర్ మాత్రమే. ఇంకా చాలా చేయాల్సి ఉంది. దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. రాజస్థాన్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి ఉందిప్రజల కలలే తన సంకల్పమని ప్రధాని మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు కనీసం రైతుల సమస్యలను అడగలేదని, కానీ తాను వారిని పూజించినట్లు చెప్పారు. కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా రైతుల ఖాతాల్లో రూ.20 వేల కోట్లు జమ చేసినట్లు ప్రధాని మోదీ తెలిపారు

# రాజకీయాలకు సిద్ధరామయ్య గుడ్ బై

రాజకీయాల నుంచి విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ఇక పోటీ చేయనని తేల్చి చెప్పారు. 'వచ్చే నాలుగేళ్లలో నాకు 83 ఏళ్లు పూర్తవుతాయి. ఆ సంగతి నాకు తెలుసు. ఆ తర్వాత అంత నిబద్ధతతో పనిచేయలేను. నా శరీర పరిస్థితి ఏంటో నాకు మాత్రమే తెలుసు. అందుకే ఇకపై ఎన్నికల్లో పోటీ చేయొద్దని నిర్ణయించుకున్నాను' అని సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు.'ప్రజలు నన్ను ప్రేమతో మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయమని అడిగారు. వాళ్ల కోరిక మేరకు నేను పోటీ చేశాను. ఇకపై మాత్రం పోటీ చేయను. నా ఆరోగ్యం గురించి నాకు మాత్రమే తెలుసు. అందుకే ఇక ఎన్నికల రాజకీయాలు చాలు అని నిర్ణయించుకున్నాను. నా కుమారుడు డాక్టర్ యతీంద్రకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు అందాయి. దానికి వివరణ కూడా ఇచ్చాం. ఆ నోటీసులో ఏముందో నా కుమారుడుకి తెలుసు. దానిపై నేను వ్యాఖ్యానించను. బెంగుళూరులో నీటీ సమస్య లేదు. అప్పుడప్పుడు కొన్ని ఊహాజనిత నివేదికలు రాస్తుంటారు. ఓ రెండు చోట్ల నీటీ సమస్యలు వచ్చాయి. వాటిని పరిష్కరించాం.' అని సీఎం సిద్ధరామయ్య తెలిపారు.గతనెల 28న కర్ణాటకలోని హనూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో యతీంద్ర మాట్లాడుతూ అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు అని విమర్శించారు. "గుజరాత్?లో మారణహోమానికి పాల్పడిన అమిత్ షా లాంటి వ్యక్తిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టారు" అని యతీంద్ర కామెంట్ చేశారు. దీనిపై స్పందించిన బీజేపీ శ్రేణులు చామరాజనగర్ జిల్లా ఎన్నికల అధికారి సీటీ శిల్పానాగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్ నేత యతీంద్రకు జిల్లా ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

# త్వరలో మమ్మల్నీ అరెస్టు చేస్తారు

తర్వాత వరుసలో ఉన్న నేతలను జైలులో పెట్టేందుకు యత్నిస్తోంది. నా రాజకీయ జీవితాన్ని కాపాడుకోవడానికి తమ పార్టీలో చేరాలని ఒక వ్యక్తి ద్వారా భాజపా నన్ను సంప్రదించింది. లేకపోతే ఈడీ అరెస్టు చేస్తుందని ఆ వ్యక్తి ద్వారా చెప్పించింది" అని ఆరోపించారు. మద్యం కేసు విచారణలో భాగంగా కేజ్రీవాల్‌కు కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆయనను తిహాడ్ జైలుకు తరలించారు. ఈ క్రమంలో ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తారా..? అంటూ అడిగిన ప్రశ్నకు ఆతిశీ బదులిచ్చారు. అందుకు ఎలాంటి కారణం లేదన్నారు. "ఈ అంశానికి సంబంధించి రెండు ప్రొవిజన్స్ ఉన్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లకు పైగా శిక్ష పడితే.. ప్రజా ప్రతినిధిగా ఉండేందుకు వీలు ఉండదు. కానీ కేజ్రీవాల్ దోషిగా తేలలేదు. ఆయనకు దిల్లీ అసెంబ్లీలో భారీ మెజార్టీ ఉంది. అందుకే ఆయన రాజీనామా చేయడానికి ఎలాంటి కారణం లేదు" అని తెలిపారు. ఒకవేళ ఆయన రాజీనామా చేస్తే.. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడం భాజపాకు మరింత సులభం అవుతుందని విమర్శించారు.

# డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ఉదేశంతో, దరఖాస్తు గడువును పొడిగించింది.టెట్‌లో అర్హత సాధించని విద్యార్థులు, నూతనంగా డీఎడ్, బీఎడ్ చేసిన విద్యార్థులకు డీఎస్సీలో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత నెల మార్చి 14న విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో, మార్చి 27 నుంచి ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొంది. మే 23 నుంచి జూన్ 3 వరకు కంప్యూటర్ బేస్డ్(ఆన్‌లైన్) విధానంలో టెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది.మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్ర సర్కారు మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,629 కాగా, 727 భాషా పండితులు, 182 పీఈటీ, 6,508 ఎస్జీటీ, ప్రత్యేక కేటగిరి కింద స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 220, ఎస్జీటీ 796 పోస్టులను భర్తీ చేయనుంది. జులై 1వ తేదీ 2023నాటికి 18 ఏళ్లు పూర్తి అయి 46 ఏళ్లు లోపు ఉన్నవారు డీఎస్సీ రాసేందుకు అర్హులని నోటిఫికేషన్?లో పేర్కొంది. అభ్యర్థులు మార్చి 4వ తేదీ నుంచి ఆన్?లైన్?లో దరఖాస్తులు చేసుకోవచ్చని విద్యాశాఖ పేర్కొంది. గతేడాది బీఆర్ఎస్ సర్కార్ విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు 1,77,502 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ సర్కారు పోస్టుల సంఖ్య పెంచిన నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## తిహాడ్ జైల్లో నీరసించిన కేజ్రీవాల్

మనీ లాండరింగ్ కేసులో అరెస్టైన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైలులో (రిమాండ్ ఖైదీగా) ఉన్న సంగతి తెలిసిందే. ఆయన్ను విస్తీర్ణం కలిగిన సెల్‌లో ఉంచారు. మొదటిరోజు రాత్రి కేవలం కొద్దిసేపు మాత్రమే నిద్రపోయినట్లు జైలు వర్గాలు వెల్లడించాయి.'కేజ్రీవాల్‌ను తిహాడ్ జైలుకు సోమవారం సాయంత్రం 4 గంటలకు తీసుకువచ్చారు. సెల్‌లోకి పంపించే ముందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పుడు ఆయన రక్తంలో చక్కెర స్థాయి 50 కంటే తక్కువ ఉంది. వైద్యుల సూచన మేరకు ఔషధాలు అందించాం' అని జైలు అధికారులు వెల్లడించారు. జైల్లో ఆయనకు ఓ పరుపు, దుప్పట్లు, రెండు దిండ్లు సమకూర్చినట్లు సమాచారం. మధ్యాహ్నం చాయ్, రాత్రి భోజనంగా ఇంటి నుంచి తెచ్చిన ఆహారాన్ని అందించారు. రాత్రి కొద్దిసేపు కటిక నేలపైనే పడుకున్నారని, అర్ధరాత్రి వరకూ సెల్‌లో అటు, ఇటు తిరుగుతూ కనిపించారని జైలు వర్గాలు వెల్లడించాయి.

# మల్కాజిగిరిలో బిజెపితోనే మనకు పోటీ

మల్లా రెడ్డి మేడ్చల్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్రమంతా తిరగాలి. మిగతా నియోజకవర్గాల్లో కూడా ఆయన గొంతు అవసరం అని కేటీఆర్ పేర్కొన్నారు. మల్లారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించి ఎన్నో రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఆయన నియోజకవర్గంలో 10 మున్సిపాలిటీలు ఉంటే అన్నింటికి అన్ని గెలిచారు. అయితే గెలిచింది మల్లారెడ్డి అంటున్నారు కానీ గెలిపించింది మీరు. మీరు కష్టపడితేనే 10కి 10 గెలిచాం. ఎంతో కమిట్ మెంట్ ఉంటేనే ఇది సాధ్యమైంది. మేడ్చల్‌లో బీఆర్ఎస్ బలమేందో తెలిసిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సామాజిక సేవలు చేస్తూ మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లోని ప్రజలతో కలిసి మెలిసి ఉన్నారు. బ్రహ్మాండంగా ఆయనకు సేవాగుణం ఉంది. వారిని కేసీఆర్ పిలిచి ఆశీర్వదించి అభ్యర్థిగా ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మందికి పుట్టిన బిడ్డలు మా బిడ్డలే అని చెప్పుకునే బాపతి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ పేర్కొన్నారు.తూంకుంట నుంచి జేబీఎస్ వరకు, కండ్లకోయ నుంచి ప్యాట్నీ వరకు స్కైవే నిర్మిస్తామని, 100 ఎకరాలు రక్షణ భూములు ఇవ్వాలని ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిస్తే లాభం లేకుండా పోయింది. చివరకు గతేడాది ఆగస్టులో తెలుగు అధికారి గిరిధర్‌ను.. నేను మంత్రిగా, సీఎస్ శాంతి కుమారి వెళ్లి కలిసి స్కైవేలపై చర్చించాం. ఆయన పుణ్యమా అని మొన్న ఆర్డర్ బయటకు వచ్చింది. ఆ ఆర్డర్ బీజేపీ, కాంగ్రెస్ వల్ల ఏం రాలేదు. మందికి పుట్టిన బిడ్డలు మా బిడ్డలే అని చెప్పుకునే బాపతి రేవంత్ రెడ్డి. ఎందుకంటే.. 100 రోజుల్లో స్కైవే నిర్మాణాలకు ఆర్డర్ నేనే తెచ్చాను అని రేవంత్ రెడ్డి చెప్పుకుంటుండు. చెప్పుకునేందుకు ఇజ్జత్ ఉండాలి. కనీసం ఆలోచన ఉండాలి. ఒక ఫైల్ రావాలంటే నెలలు పడుతుంది. ఆగస్టులో పని అయిపోయింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ కారణంగా.. మొన్న ఆర్డర్ వచ్చింది. మీరు గెలుస్తరు అనుకోలేదు. మేం ఓడుతామని అనుకోలేదు. కానీ అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారు. కానీ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. నిన్న మొన్నటి దాకా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం చేసిండు. కేంద్రంతో కేసీఆర్ పంచాయితీ పెట్టుకున్నాడు కాబట్టి స్కైవేలకు అనుమతి ఇవ్వలేదు.. నేను మంచిమాట చెబితే ఇచ్చారని రేవంత్ రెడ్డి డైలాగులు కొడుతున్నారు. కానీ వాస్తవం రేవంత్‌కు తెలుసు. కాగితం నీ చేతికొచ్చే

వరకు నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నావు అని రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు. మన గవర్నమెంట్ లో ఒక లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. కానీ చెప్పడంలో ఫెయిలయ్యాం. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి ఎల్‌బీ స్టేడియంలో మీటింగ్ పెట్టి మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకుంటుండు. మరి నువ్వు వచ్చిన తర్వాత ఎన్నినోటిఫికేషన్లు ఇచ్చావు.. ఎన్ని పరీక్షలు పెట్టావు. కేసీఆర్ హయాంలో 30 వేల ఉద్యోగాలు ఇస్తే.. వాటికి కాగితాలు ఇచ్చి నేనే ఇచ్చానని చెప్పుకుంటున్నావు. ఇలా ఇచ్చి మందికి పుట్టిన బిడ్డలు మా బిడ్డలే అని చెప్పుకుంటుకున్నావు. కాంగ్రెసోళ్లు పచ్చి మోసగాళ్లు.. రెండు లక్షల ఉద్యోగాలు ఒకే ఏడాదిలో ఇస్తానని చెప్పాడు. తెలంగాణ పిల్లలు చైతన్యవంతులు అమాయకులు కాదు.. 30 వేల ఉద్యోగాలు నీ ఖాతాలోకి వేసుకునే ప్రయత్నం చేస్తున్నావు. అది కేసీఆర్ ఖాతాలోకి వెళ్తుంది. మాటిచ్చిన ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సుప్రీంకు పతంజలి క్షమాపణ

## - సుప్రీం ఆగ్రహం.. బేషరతుగా క్షమాపణలు చెప్పిన రామ్‌దేవ్ బాబా

వ్యక్తం చేసింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని రామ్‌దేవ్ బాబా ఆచార్య బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ప్రకటనల విషయంలోనూ సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయవద్దని మరోసారి హెచ్చరించింది. ఆ నోటీసు లకు పతంజలి స్పందించలేదు. 'మీ ప్రతిస్పందన ఎందుకు దాఖలు చేయలేదు..?' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరు న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. దానిలో భాగంగా ఇటీవల పతంజలి సంస్థ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. న్యాయవ్యవస్థ పట్ల అత్యంత గౌరవం ఉందని వ్యాఖ్యానిస్తూ.. క్షమాపణలు తెలియజేసింది. తాజాగా వారు కోర్టు ముందుకు వచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్

## - 8 మంది మావోయిస్టుల మృతి

అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది గాలింపు చేపట్టగా.. మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి.కాల్పులు ముగిసిన అనంతరం ఘటనాస్థలంలో ఎనిమిది మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. లైట్ మెషిన్ గన్, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు.సాధారణంగా ఏటా మార్చి-జూన్ మధ్య మావోయిస్టులు ఈ ప్రాంతంలో వ్యూహాత్మక ఎదురుదాడి శిక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలోనే బస్తర్ ప్రాంతంలో భద్రతా బలగాలపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతాయని పోలీసులు వెల్లడించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దాడులు పెరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నారు.మార్చి 27న కూడా బీజాపుర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో ఆరుగురు మావోయిస్టులను బలగాలు మట్టుబెట్టాయి. తాజా ఘటనతో కలిపి బస్తర్ ప్రాంతంలో ఇప్పటివరకు జరిగిన పలు ఎదురుకాల్పుల్లో మొత్తం 41 మంది మావోయిస్టులు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. బీజాపుర్ జిల్లా బస్తర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ స్థానానికి ఏప్రిల్ 19న తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది.

## హార్డ్‌డిస్కులు ధ్వంసం చేసి మూసిలో పడేశారు

సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ప్రధాన నిందితుడు ప్రణీత్‌రావును విచారిస్తున్న పోలీసులకు కీలక వివరాలు లభ్యమయ్యాయి. హార్డ్‌డిస్క్‌లను డిసెంబరు 4న మూసీలో పడేసినట్లు ప్రణీత్‌రావు వెల్లడించారు. అలాగే భుజంగరావు, తిరుపతన్న రిమాండ్? నివేదికలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు రిమాండ్? రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా రిమాండ్ రిపోర్టులో అనేక విషయాలను పోలీసులు పొందుపరిచారు.డిసెంబరు 4వ తేదీన మూసీ నదిలో హార్డ్?డిస్కులను పడేసినట్లు ప్రణీత్? రావు ఇచ్చిన సమాచారంతో నాగోలు వద్ద మూసీలో హార్డ్? డిస్క్? శకలాలను పోలీసులు సేకరించారు. మూసీ వద్ద 5 హార్డ్ డిస్క్ కేసులు, 9 హార్డ్‌డిస్క్‌ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మూసీలోనే 6 మెటల్ హార్డ్ డిస్క్ ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఎస్ఐబీ కార్యాలయంలోనూ పోలీసులు పలు ఆధారాలు సేకరించారు. ఎస్ఐబీ కార్యాలయంలో 12 కంప్యూటర్లు, 7 సీపీయూలు, ప్రణీత్‌రావు బృందం వాడిన ల్యాప్‌టాప్ మానిటర్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎస్ఐబీ కార్యాలయం ఆవరణలో పాక్షికంగా కాలిన డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయం సీసీ ఫుటేజీ, లాగ్‌బుక్ ప్రతులను సేకరించారు. ఎస్ఐబీ కానిస్టేబుల్ నరేశ్ వాంగ్మూలం పోలీసులు నమోదు చేసుకున్నారు. విపక్ష అభ్యర్థుల డబ్బుల పంపిణీపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులపై అక్రమంగా భుజంగరావు, తిరుపతన్న నిఘా పెట్టినట్లు వెల్లడించారు. అంతకు ముందు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు బుధవారం తీర్పును వెలువరించనుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నకు ఐదు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. వీరికి ఈ నెల 6 వరకు రిమాండ్‌ను నాంపల్లి కోర్టు విధించింది. దీంతో ఇద్దరు నిందితులనూ చంచల్‌గూడ జైలుకు పోలీసులు తరలించారు. వీరిద్దరినీ ఐదు రోజులు విచారించిన పోలీసులు వారి నుంచి కేసుకు సంబంధించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. ఉన్నతాధికారులు చెప్పినట్లే చేశామని వారిద్దరూ పోలీసుల కస్టడీలో వెల్లడించినట్లు తెలుస్తోంది.

# భూకబ్జా కేసులో కెసిఆర్ అన్న కుమారుడు

## కన్నారావును అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్2 (ప్రజా మంటలు): అవినీతి, అక్రమాల కేసులు కల్వకుంట్ల కుటుంబంలో అరెస్టులకు దారితీస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్సీ కవిత లిక్కర కేసులు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకరు అరెస్ట్ అయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ సోదరుడి కుమారుడు కల్వకుంట్ల తేజేశ్వర్ రావు అలియాస్ కన్న రావును ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను పోలీసులు రిమాండ్ చేయనున్నారు. హై కోర్టులో కన్నారావు బెయిల్ తిరస్కరణకు గురయ్యింది. రెండుసార్లు ముందస్తు బెయిల్ కోసం కన్నా రావు ప్రయత్నం చేశాడు. మన్నెగూడలో 2 ఎకరాల భూమి కబ్జాకు కన్నారావు అండ్ గ్యాంగ్ యత్నించింది. కన్నారావుతో పాటు 38 మందిపై కేసులు నమోదయ్యారు. కన్నారావు కోసం పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. కన్నారావుపై వివిధ సెక్షన్ల సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న ఎండలు

## రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు - పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్,ఏప్రిల్2 (ప్రజా మంటలు): వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోగా, వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడుతున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో .. పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ.. ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయంటే సూర్యుడి విశ్వరూపం ఏ రేంజ్‌లో ఉందో అర్థంచేసుకోవచ్చు. ఒకవైపు ఎండలు దంచికొడుతుంటే, ఇంకోవైపు వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణలో 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 37 మండలాలకు వార్నింగ్ ఇచ్చింది. అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని ఐఎండీ చెబుతోంది. ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది ఇప్పుడున్న ఉష్ణోగ్రతలు శాంపిల్స్ మాత్రమేనని, ముందుముందు ఇంకా పెరుగుతాయంటోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని

హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిస్తోంది వాతావరణశాఖ. అందుకే అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని చెబుతోంది. తెలుగు రాష్ట్రాల్లో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సాధారణం కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీలో మంగళవారం 37 మండలాల్లో వడగాల్పుల ముప్పు అధికంగా ఉంటుందని వెల్లడించారు. అటు, తెలంగాణలోని 15 జిల్లాల్లో వడగాల్పుల ముప్పు ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు అధికారులు అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప పగటిపూట బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో సగటున 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రాబోయే 5 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

# అందరి సహకారంతోనే ఉత్సవాలు జయప్రదం

## ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఏప్రిల్ 02 (ప్రజామంటలు): ధర్మపురి క్షేత్రంలో మార్చి 20నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు 13 రోజులపాటు నిర్వహించిన శ్రీలక్ష్మీ నారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతోనే జయప్రదమైనాయని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ అన్నారు. మంగళ వారం దేవస్థానంలో రవీందర్ మాట్లాడుతూ, గత సంవత్సరం కన్నా ఈఏడు భక్తులు అధికంగా హాజరైనారని, ఆదాయం అధికంగా రావడం జరిగిందన్నారు. ఈసారి దాతల ద్వారా పలు క్వింటాళ్ళ బియ్యంతో పాటు దాదాపు భారీగా నగదు, విలువైన భోజన వస్తు సామగ్రి సమకూరినట్లు, వేలాది మందికి 10రోజులలో అన్నదానం గావించడం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, హాజరై పట్టు వస్త్రాలను సమర్పించిన జగిత్యాల జిల్లా కలె క్టర్ షేక్ యాస్మిన్ భాషకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జగిత్యాల ఎస్పీ అనంతశర్మ, అడిషనల్ కలెక్టర్ దివాకర, డీఎస్పీ రఘు చరణ్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ధర్మపురి తహశీల్దార్ కృష్ణ చైతన్య, సిఐ రాం నరసింహా రెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, ఇతర ఎస్ఐలు, ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, ఫైర్ ఆఫీసర్ కొమురయ్య, డీ పీ ఆర్ ఓ భీమ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీధర్, డిప్యూటీ డీ ఎం హెచ్ ఓ శ్రీనివాస్, ఆర్ఆర్ అండ్ బి ఈ ఈ నరసింహా చారి, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ రెడ్డి, డీ ఈ ఈ ధర్మ కుమార్, ట్రాన్స్కో డీ ఈ రాజిరెడ్డి, గ్రామీణ నీటి పారుదల డీ ఈ ఈ మురళి, ఫిషరీస్ డీ ఎఫ్ ఓ దామోదర్, మిషన్ భగీరథ డీ ఈ ఈ రోహిత్, ధర్మపురి, నెరెళ్ల మెడికల్ ఆఫీసర్ లు రత్నం, శివ కుమారి, ఆర్ అండ్ బి ఏ ఈ సతీష్, ఎం పి డి ఓ రవీందర్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ సత్తెమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, మాజీ దేవస్థానం చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, వర్తక, ఆరెస్సెస్, స్వచ్ఛంద సంఘాలు, స్థానిక ప్రైవేటు పాఠశా లలు, వాసవి సేవాదళ్, మహిళా దళ్, రోవర్స్ అండ్ రేంజర్స్, నాట్యమండలికి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానంగా తమకు భగవత్ సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కు, తనకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉన్న తమ తోటి ఉత్సవ కమిటీ సభ్యులకు జక్కు రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## బహుజన చక్రవర్తి శ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

రాయికల్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు): రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ నాయకులు మాట్లాడుతూ గోల్కొండ కోట జయించి బహుజన సామ్రాజ్యాన్ని స్థాపించిన తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి శ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జవ్వాజి నర్సాగౌడ్, గ్రామ నాయకులు కాటిపల్లి గంగారెడ్డి, సామల్ల వేణు, ఆదిరెడ్డి, మహిపతి రెడ్డి, కంటే విష్ణు, కొల్లూరు వేణు, గౌడ సంఘ సభ్యులు, నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.




# పేను (లైస్) సమస్యలకు చక్కటి పరిష్కారం..

## చిన్నారులకు కొత్త మెడికర్ ప్రొడక్ట్

సికింద్రాబాద్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు): గత 50 ఏండ్లుగా విశ్వసనీయమైన బ్రాండ్గా ప్రజల్లో గుర్తింపు పొందిన మెడికర్ సంస్థ చిన్నారుల్లో పేను (లైస్) సమస్యలకు చెక్ పెట్టేందుకు కొత్త షాంపును మార్కెట్ లో విడుదల చేసింది. ఈమేరకు సికింద్రాబాద్ బేగంపేట లో మంగళవారం మెడికర్ సంస్థ ప్రతినిధులు చిన్నారుల్లో పేను సమస్యలపై అవగాహన సెమినార్ ను నిర్వహించారు. కొబ్బరి, వేప యొక్క 100 శాతం సహజ యాక్టివ్ లతో పిల్లల కోసం తీర్చిదిద్దిన సురక్షితమైన షాంపును అందుబాటులోకి తెచ్చినట్లు మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి తెలిపారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లు లేకుండా కేవలం 4 వారాల్లో పేనును తొలగిస్తుందన్నారు. హైజీన్ మిషన్ ద్వారా మెడికర్ 300 పాఠశాల ల్లో 3.5 లక్షల మందికి పైగా చిన్నారులకు పేను సమస్యను ఎలా ఎదుర్కొవాలనే అంశంపై అవేర్నెస్ కల్పించామన్నారు. పీడియాట్రిషియన్ , డెవలప్ మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ అమూల్య మైసూర్ మాట్లాడుతూ...తలలో పేనులు ఉండటం సాదారణమైనప్పటికీ ఈ సమస్య దీర్ఘకాలికంగా ఉంటే ఎన్నో ఇబ్బందులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, బహుమతులను అందచేశారు. 1968 లో ప్రారంభించబడిన మెడికర్ సంస్థ దేశం విశ్వసనీయ బ్రాండ్ గా మారిందన్నారు. ఇది పిల్లలకు సేఫ్ అని వైద్య పరంగా పరిక్షించబడిందన్నారు. వాష్ %--%ఆఫ్ షాంపూ ఫార్మట్ ( సాచెట్ ఆండ్ బాటిల్స్ ) లో అందుబాటులో ఉంటుందన్నారు.

# ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఏప్రిల్ 02 (ప్రజామంటలు): సుప్రసిద్ధ పుణ్యక్షే త్రమైన ధర్మపురిలో దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 20 నుండి ఏప్రిల్ 1వ తేది వరకు 13రోజుల పాటు నిర్వహించిన శ్రీలక్ష్మీనర సింహ (యోగానంద, ఉగ్ర), శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవ కార్యక్రమాలు సోమ వారం అర్ధరాత్రితో ఘనంగా ముగిసాయి. సంపూర్ణంగా సమిష్టి కృషితో జయప్రదమైనాయి. మార్చి 21వ తేదీన కళ్యాణోత్సవం, మార్చి 24,25,26 తేదీలలో కోనేరులో యోగా నంద, ఉగ్ర నారసింహ, వేంకటేశ్వరుల తెప్పోత్సవ, డోలోత్సవాలు, 29న రథో త్సవం, 30,31, ఏప్రిల్ 1తేదీలలో ముర్వురు స్వాముల ఏకాంతోత్సవ వేడుకల ప్రధాన కార్యక్రమాలకు రాష్ట్రేతర సుదూర ప్రాంతాలనుండి అశేష భక్త, యాత్రిక జనం ఏతెంచి, కార్యక్రమాలలో భాగస్వాములై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల విజయవంతానికి, భక్తులకు వలసిన సదుపాయాల కల్పనకు, సౌకర్యాల మెరుగుదలకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికార, ఉద్యోగ వర్గాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థల బాధ్యులు సంపూర్ణ సహకారాన్ని అందించి ప్రశంసాపాత్రు లైనారు. వివిధ ఆర్టీసీ డిపోలు వ్యూహాత్మకంగా, భక్తుల రద్దీకి అనుగుణంగా, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రత్యేక బస్సులను నడిపాయి. పోలీసుశాఖ ఎలాంటి అవాంఛనీయాలు చోటుచేసు కోకుండా పకడ్బందీ బందో బస్తు చర్యలు చేపట్టింది. ఎలాంటి అవాంతరాలు కలుగ కుండా విద్యుత్శాఖ సమయోచిత చర్యలు తీసుకుంది. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. పారిశుద్ధ్య సౌకర్యాల ఏర్పాట్లలో స్థానిక పురపాలక సంఘం పక్షాన మున్నెన్నడూ లేనట్టి ప్రత్యేక శ్రద్ధ కనబరచి, క్షేత్రంలో చెత్త చెదారం పేరుకుపోకుండా, అంటు రోగాలు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టింది. సాంస్కృతిక కార్యక్రమాలలో వివిధ కళాకారులను, వాద్యకారులను రప్పించి, నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేవస్థానం పక్షాన బ్రహ్మోత్సవాల సందర్భంగా దాతల చేయూతతో ఏర్పాటు చేసిన నిత్యాన్న కార్యక్రమం, క్షేత్రానికి అరుదెంచిన వేలాది భక్తులకు, యాత్రికులకు ఎంతగానో ఉపయోగపడింది. అన్నదాన కార్యక్రమ సక్రమ నిర్వహణకు సేవాభావంతో స్థానిక చైతన్య భారతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన నేషనల్ గ్రీన్ కోర్






విద్యార్థులు, ఆర్యవైశ్యులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకు బాష్యం చెప్పారు. బ్రాహ్మణ నిత్యాన్న సత్రం, అన్నపూర్ణ సేవా సమితి, ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం, ఆర్యవైశ్య సంఘం, స్థానిక విప్రుల గృహాలలో వసతులు, భోజన, త్రాగునీటి సౌకర్యాలు కల్పించి, భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా తమవంతు కృషిసల్పారు. వివిధ ఛానళ్ళ ద్వారా ప్రసారం గావించి, దేశ విదేశాలలో స్వాముల ఉత్సవాలను ప్రత్యక్షంగా చూసే సద వకాశాన్ని కలిగించి, ప్రశంసాపాత్రులైనారు. దేవస్థానం సిబ్బంది, స్థానిక వేద పండితులు, కళాకారులు వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు అంకిత భావంతో, అలుపెరుగక, అవిశ్రాంత సేవలందించారని, దేవాదాయ శాఖాధికారులు మార్గ నిర్దేశం చేశారని, క్షేత్ర, దేవస్థాన పౌరోహి తులు, వేదపండితులు, వివిధ స్థాయిల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, స్థానిక దైవ కార్యానురక్తులు, మీడియాను దేవస్థానం ఈఓ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు ప్రశంసించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎండిన పంటకు నష్టపరిహారం సాగుకు నీరు అందించాలని

## జడ్పీ చైర్ పర్సన్, కోరుట్ల ఎమ్మెల్యే లకు వినతి



జగిత్యాల ఏప్రిల్ 02 (ప్రజామంటలు): జిల్లాలో ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం,పంటలకు నీళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ రాంబాబుకు కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ కల్వకుంట్లతో కలిసి వినతిపత్రం అందజేసిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ నీటి నిర్వహణ, విద్యుత్ వైఫల్యమే పంట నష్టమన్నారు. వడగళ్ళు, ఎండిన పంటలకు ఎకరాకు 25 వేల నష్ట పరిహారం ఇవ్వాలి. వంద రోజుల్లో చేస్తానన్న హామీలు వెంటనే అమలు చేయాలి. పంటలకు ఇస్తామన్న బోనస్ యాసంగి పంటలకు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. కెసిఆర్ హయాంలో ఒక్క ఎకరా ఎండలే..కాంగ్రెస్ వచ్చాకే పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్ళు తగ్గి రైతుల్లో కన్నీళ్లు పెరిగినయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఉన్న మద్దతు ధరపై క్వింటాల్కు బోనస్ గా అదనంగా రూ . 500/ ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇప్పటివరకు దానిపై ఎలాంటి కార్యచరణ లేదని అన్నారు. త్వరగా ప్రభుత్వం రైతులను ఆదుకొని వారికి నష్టపరిహారం మరియు క్వింటాలుకు మద్దతు ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మెట్ పెల్లి ఎంపీపీ సాయి రెడ్డి, కోరుట్ల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు రాంరెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఓదార్చే మాటలకన్నా సహాయం చేసే చేతులే మిన్న

# మానవసేవయే మాధవసేవ

### నిరుపేద తల్లి తండ్రి లేని అమ్మాయి వివాహానికి సహాయం అందించిన కటారి చంద్రశేఖర రావు



గొల్లపల్లి ఏప్రిల్ 02 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం ఇస్రాజ్ పల్లె గ్రామానికి చెందిన అమ్మా నాన్న లేని నిరుపేద యువతి పురాణపు స్రవంతి కి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కటారి చంద్రశేఖర రావు వివాహానికి ఒక క్వింటాల్ బియ్యం అందించిచార్ తన ఉదారతను చాటుకున్న జగిత్యాల జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గొల్లపల్లి మండల మాజీ జడ్పిటిసి మాజీ ఎంపీపీ మాజీ సింగల్ విండో చైర్మన్ కటారి చంద్రశేఖర రావు. నిరుపేద అమ్మాయి వివాహానికి సహాయం అందించినందుకు ఇస్రాజ్ పల్లె గ్రామ ప్రజలు ప్రజా ప్రతి నిధులు స్రవంతి అమ్మమ్మ కటారి చంద్రశేఖర్ రావు కు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సానా రవీందర్, కొమురయ్య, బైరం రవీందర్ పాల్గొన్నారు.

# రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

## ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి: బిఆర్ఎస్ వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి



హుజురాబాద్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు): రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించడం లేదని, కొన్ని చోట్ల సరైన సమయంలో సాగు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీఆర్ఎస్ వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హుజురాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ...ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టం జరిగిందని అన్నారు. పంట నష్టం అంచనా వేసి ఎకరాకు రూ. 10 వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంతవరకు పరిహారం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పరిహారం అందించి రైతులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఎకరాకు రైతులు రూ.20 నుండి రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చులవుతున్నాయని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల పరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదన్నారు. కావున పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. యాసంగి సీజన్ వడ్ల కొనుగోళ్లు ప్రారంభమైనందున తక్షణమే పూర్తి స్థాయిలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇతర పంటలకు సైతం బోనస్ అందించాలని కోరారు. ప్రతి ఏటా తాలు, తేమ, తరుగు పేరుతో క్వింటాలుకు 4 నుండి 6 కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారని, మిల్లర్లతో సంబంధం లేకుండా వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాజా లింగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతోపాటు కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలని, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్నీ వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు కమిషన్ ను ఏర్పాటు చేయాలని, సమగ్ర పంటల బీమాను అమలు చేసి రైతులతోపాటు రైతు కూలీలు, భూమిలేని రైతులకు సైతం బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కొత్త సాగు విధానంతోపాటు పంటల సమగ్ర ప్రణాళికను విడుదల చేయాలని, ఈ అంశాలను జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రిల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే అమలయ్యేలా చూసి, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని లింగారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కే సమ్మయ్య, పి సదానందం, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నర్సరీమన ఊరు మన బడి పనులను తనిఖీ చేసిన జడ్పీసీఈఓ

వేలేర్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు): వేలేరు మండలంలో జడ్పీ సీఈఓ పర్యటన హనుమకొండ జిల్లా జడ్పీ సీఈవో విద్యాలత వేలేరు మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా వారు మల్లికుదుర్ల,సోడాసపల్లి, వేలేరు గ్రామపంచాయతీలను సందర్శించడం జరిగింది వారి సందర్శనలో భాగంగా జరుగుతున్న పనులను,గ్రామపంచాయతీలలో నీటి సరఫరా అంశమును, వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాఠశాలలలో నిర్మాణంలో ఉన్న సంబంధిత పనులను, గ్రామపంచాయతీ నర్సరీలను, మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు నిర్వహణ మరియు ధాన్యం కొనుగోలు సెంటర్లను పరిశీలించడం జరిగింది ఈ పర్యటనలో వారి వెంట ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న, ఎంపీవో విమల, ఏఈ పిఆర్, పంచాయతీ కార్యదర్శులు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలకు కలెక్టర్లకు భారాస వినతిపత్రం



యుద్ధ ప్రాతిపదికన నివేదికలు తెప్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల వారీగా వచ్చిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపి ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరితో పాటు వివిధ పంటలకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో హామీ ఇచ్చి మోసం చేసింది. వెంటనే రైతులకు న్యాయం జరిగిలే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ప్రతాప్, విజయ్, రాజారెడ్డి, జెడ్పిటిసి రాజశేఖర్, ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

## ఘనంగా జరిపిన మండల గౌడ నాయకులు

ఎల్కతుర్తి ఏప్రిల్ 02 (ప్రజామంటలు): ఎల్కతుర్తి బస్టాండ్ కుడలి వద్ద ఓ బి సి మండల అధ్యక్షులు గోడిశాల నరేష్ గొడిశాల రాజన్న గౌడ్ మాజీ సర్పంచ్ గోడిశాల యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి పురస్కరించుకొని ఎల్కతుర్తి మండల కేంద్రం లో గల బస్టాండ్ కూడలి వద్ద పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు టిపిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు, తంగళ్ళపల్లి రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రత్నాకర్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల తిరుపతి, సాతూరి ప్రభాకర్. డైరెక్టర్ బుర్ర రవి కుమారు శనిగారపు వెంకటేశు డాక్టర్ రమేష్ ప్రదీప్ గౌడ్ బన్నీ అల్లగొండ రాజు, చల్ల మల్లికార్జున్, సాంబరాజు ప్రశాంతు, కార్యకర్తలు పాల్గొని ఘన నివాళులర్పించారు.



# కరువుపై బిఆర్ఎస్ ఎన్నికల రాజకీయం !

పార్లమెంటు ఎన్నికల ప్రచారం ఇప్పుడు కరువు, రైతుల చుట్టూ తిరుగుతుంది.తెలంగాణలోని పలు జిల్లాల్లో కరువు కోరలు చాస్తోంది. చాలా ప్రాంతాల్లో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు అడుగంటుతుండటంతో పంటలపై ప్రభావం పడుతోంది. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ..విపక్ష బిఆర్ఎస్ ప్రచారం మొదలు పెట్టింది. ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సీరియస్‌గా దర్యాప్తు సాగుతోంది. అందులో కెసిఆర్, కెటిఆర్‌ల పేర్లు ఉన్నాయంటూ లీకులు వస్తున్నాయి. ఈ క్రమంలో తమ పాపాలను పక్కన పెట్టి ప్రజల దృష్టి మళ్లించడానికి, ఎన్నికల్లో లబ్ది పొందడానికి బిఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. తెలంగ్రాణలోనే కాదు..దేశం యావత్తూ కరువుతో అల్లాడుతోంది. కర్నాటకలో మంచినీటికి అల్లాడుతున్నారు. మేడిగడ్డ కుంగిపోవడంతో అందులో నీళ్లు నింపడానికి లేకుండా పోయింది. ఈ క్రమంలో కాలేశ్వరం అవినీతిపైనా, మేడిగడ్డ కుంగుబాటుపైనా విచారణ సాగుతోంది. దీనినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కరువు కలిసి వచ్చిందన్న సంతోషంలో బిఆర్ఎస్ ఉంది. దీనికితోడు పార్టీలో ఉన్న నేతలు జంప్ అవుతున్నారు. టిక్కెట్ ఇచ్చినా మాకొద్దీ టిక్కెట్ అంటూ జారుకుంటున్నారు. ఈ స్థితిలో బిఆర్ఎస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. అందుకే పార్టీ మారిన వారిని చిల్లరగాళ్లు అంటూ విమర్శలు అందుకుంది. కరువు వస్తే నీళ్లు ఇవ్వడం లేదని, విద్యుత్ రావడం లేదనే పసలేని వాదనతో ప్రజల ముందుకు కెసిఆర్ ఆయన పరివారం బయలుదేరింది. ఇప్పుడు పంట చేతికి రావడంతో పాటు కొన్ని ప్రాంతాలలో పంటలు ఎండి పోయాయి. ఈఅంశాన్ని తెరపైకి తీసుకు వచ్చి కాంగ్రెస్‌కు అంటగట్టాలని బిఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. ఇప్పటికే ముఖ్యనేతలు ఎండిన పంటపొలాలను పరిశీలించారు. మాజీ సియం కెసిఆర్ మొన్నటికి మొన్న ఎండిన పంటపోలాలను పరిశీలించారు. అయితే నానా పాపాలు చేసిన బిఆర్ఎస్ తీరుపై అధికార పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తుంది.ఎందుకంటే ఇప్పటికే లోకసభ ఎన్నికల వేడి మొదలైంది.. నామినేషన్లకు గడువు రాకున్నా నేతలు తమ ప్రచార అస్త్రాలన్నీ బయటికి తీస్తున్నారు. ఇప్పుడు పలు ప్రాంతాలలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మరో పదిహేను రోజులలో పంటలు చేతికి రానున్నాయి. అయితే కండ్ల ముందే ఈ సమస్య ఉండడంతో దీనిపైనే బిఆర్ఎస్ నేతలు దృష్టి పెట్టాయి. దీనిని ఓ సమస్యగా చేస్తే రాజకీయ లబ్ది పొందవచ్చన్న దురాలోచనలో ఆ పార్టీ ఉంది. బిజెపి ,బిఆర్ఎస్ పార్టీల నేతలు ఎండిన పంటపోలాలని పరిశీలించారు. ఈ రెండు పార్టీలు కూడా సాగునీటి సమస్యపై అందోళనలు నిర్వహించాయి. ఇప్పుడు రైతు సమస్యలపై మరింత ఫోకస్ పెట్టారు బిఆర్ఎస్ అధినేత, మాజీ సియం కెసిఆర్ ఎన్నికల వేళ క్షేత్రస్థాయిలో పరిశీలనకి వెళు_న్నారు. తొలివిడత జనగామ, సూర్యాపేట పర్యటనలు ముగియడంతో.. ఈనెల 5న కరీంనగర్ లోక్‌సభ పరిధిలో వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎండిపోయిన పంటపోలాలను పరిశీలించ నున్నారు. ఈ రెండు పార్టీలు రైతుల సమస్యల అధారంగానే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. 10 రోజులలో వరి ధాన్యం ఐకెపి సెంటర్లకి రావడం, అమ్మడం లాంటి కార్యక్రమాలు కొనసాగుతాయి. అయితే అదనంగా క్వింటాల్‌కి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈరెండు పార్టీలు గళం విప్పుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలకి ధీటుగానే అధికార పార్టీ సమాధానం చెబుతుంది. గత సంవత్సరం సరియైన వర్షాలు లేకపోవడం, వేగంగా ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గిపోవడం కారణంగా కరువు ఏర్పడిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల వేళా ప్రతిపక్ష పార్టీలు రైతు సమస్యలపైనా మాట్లాడుతున్నాయని చెబుతున్నారు. గత ప్రభుత్వం కారణంగానే రైతు సమస్యలు మరింత పెరిగాయని కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు.



మొత్తానికి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ మూడు పార్టీలు రైతుల వైపే చూస్తున్నారు. అయితే రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఇటీవలే విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న కేసీఆర్.. ఇది వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి, కరెంటు లో వోల్టేజ్ సరఫరాకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేసీఆర్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటే ముందు ఎనిమిదేండ్లు తాము ఇవ్వగలిగినప్పుడు కరెంటు ఇప్పుడెట్ల మాయమైందని కేసీఆర్ ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మిషన్ భగీరథతో నీళ్లు అందించామని.. ఇప్పుడు మళ్లీ ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని కేసీఆర్ ఆరోపించారు. ట్యాంకర్లు రావాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కరెంట్ వస్తూ పోతోంది కాబట్టే మోటార్లు కాలిపోతున్నాయన్నాయంటూ పేర్కొన్నారు. అసమర్థ కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు తెలంగాణ మంత్రులు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లుగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే ప్రస్తుత పరిస్థితులకు కారణమన్నారు. అధికార, విపక్ష నేతల విమర్శలెలా ఉన్నా ప్రస్తుతం తెలంగాణలో భూగర్భజల మట్టం రోజురోజుకీ దిగజారుతూ గతేడాది కంటే మరింత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి విరుగుడు కనిపెట్టాలి. వాననీటిని ఒడిసి పట్టే చర్యలకు పూనుకోవాలి. చెరువును పూడికతీసి పునరుద్ధరించాలి. మిషన్ భగీరథ పేరుతో చెరువుల పూడికతీత పనులు ఉత్తిదే అని తేలింది. అది విచారించి దానిని తిరిగి చేపట్టాలి. శ్రీరాంసాగర్‌లో నీటిమట్టం పూర్తిగా తగ్గినందున పూడికత ఎత్తే పనిచేయాలి. దీనివల్ల వచ్చే వర్షాకాలంలో నీటి నిల్వలు పెంచుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎండాకాలం పనులకు పూనుకోవాలి.

## ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవం

**హైదరాబాద్,ఏప్రిల్ 2 (ప్రజామంటలు):** 2008 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఆటిజమ్ పై 18 డిసెంబర్ 2007 న ఆమోదించిన ఒక తీర్మానం ద్వారా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. ఈ వ్యాధితో బాధపడే పెద్దలు,ప్రత్యేక అవసరాలు గల పిల్లల జీవితాలను మెరుగు పరచి, వారికి తోడ్పాటును అందించడం కోసం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఆటిజమ్ అంటే.. కొందరు పిల్లలు ఎవరితోనూ కలవకపోవటం, ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతుండటం, సరిగా మాట్లాడలేకపోతుండటం వంటి భిన్న లక్షణాలను కలిగి ఉంటే వారికి ఆటిజమ్ ఉన్నట్టు. ఆటిజమ్ భిన్న విభాగాలకు విస్తరించిన ఎదుగల సమస్య. దీన్నే పర్వేసివ్ డెవలప్మెంటల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కనబడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్త మవుతుంది.గుర్తించేదెలా. మరీ చిన్నవయసులో.. అకారణంగా నిరంతరంగా ఏడ్వటం గంటల తరబడి స్తబ్దుగా ఉండటం.. తల్లి దగ్గరకు తీసుకుంటున్నా పెద్దగా స్పందించకపోవటం.. పరిచిత వ్యక్తులను చూడగానే నవ్వక పోవటం? తల్లిదండ్రులు రమ్మని చేతులు చాచగానే ఉత్సాహంగా ముందుకు రావాల్సిన పిల్లల్లో అలాంటి స్పందనలేవీ కనిపించకపోవటంకాస్త పెద్దవయసులో..? మిగతా పిల్లలతో కలవకపోవటం పిలిస్తే పలకకపోతుండటం.. పెరిగే కొద్దీ ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుండటం..మనుషుల కంటే బొమ్మలు, వస్తువుల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండటం ఎవరైనా పలకరించినా వెంటనే సమాధానం ఇవ్వకపోవటం? కళ్లలో కళ్లు పెట్టి చూడకపోతుండటం.. ముఖంలో భావోద్వేగాలేవీ చూపించకపోతుండటం స్పీచ్ థెరపీ, లాంగ్వేజ్ స్టిమ్యులేషన్:? ఒక పద్ధతి ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకూ పిల్లలతో మాట్లాడుతుండటం, సంభాషణా సామర్థ్యం పెరిగేలా చూడటం అవసరం. దీనికి స్పీచ్ థెరపీ దోహదం చేస్తుంది. కళ్లలో కళ్లు పెట్టి చూడటాన్ని అలవాటు చేసేందుకు శిక్షణ, అలాగే మలమూత్ర విసర్జన కోసం టాయ్ లెట్ ట్రైనింగ్ వంటివన్నీ పద్ధతి ప్రకారం నేర్పిస్తారు. క్రమేపీ స్థాయులను పెంచుకుంటూ వెళతారు. దీంతో మెదడులో లోపం క్రమేపీ సర్దుకుంటుంటుంది.

## నీరందక ఎండుతున్న పంటలు

### ఎకరాకు 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి - కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యేలు

**జోగులాంబా గద్వాల,ఏప్రిల్ 2 (ప్రజామంటలు):** జిల్లాలో అనేక గ్రామాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని వారిని ఆదుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి , ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. చేతికొచ్చే దశలో పంటలు నష్టపోవడం రైతాంగానికి ఆందోళన కలిగిస్తున్నదని ఎమ్మెల్యేలు అన్నారు. రాష్ట్రంలో ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో కలెక్టర్ కు వినతిపత్రం ఇచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే గ్రామాల వారీగా పంటల నష్టాన్ని అంచనా వేయడానికి అధికారుల బృందాలను నియమించి యుద్ధ ప్రాతిపదికన నివేదికలు తెప్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల వారీగా వచ్చిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపి ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరితో పాటు వివిధ పంటలకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో హామీ ఇచ్చి మోసం చేసింది. వెంటనే రైతులకు న్యాయం జరిగిలే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ప్రతాప్, విజయ్, రాజారెడ్డి, జెడ్పిటిసి రాజశేఖర్, ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్‌లో దోషులు బయటపడాలి

### నయీం డైరీ దొంగలను పట్టుకోవాలి - కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ డిమాండ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్2 (ప్రజామంటలు):** రాష్ట్రంలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరెవరు ఉన్నారో తెలియాలన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారో రికార్డ్ చేసిందని ఆరోపించారు. ఇందులో ఇంకా చాలా అంశాలు బయటకు రావాలన్నారు. రాజకీయ నాయకులు, బిజినెస్ మ్యాన్‌ల ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో అసలు సూత్రధారులు ఎవరు అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఇప్పటికే పలువురు అధికారులు అరెస్ట్ అయ్యారని కాంగ్రెస్ సీనియర్ నేత తెలిపారు. నయీం అనే గ్యాంగ్ స్టర్ గతంలో కోట్ల రూపాయలు, భూములు కాజేశారని... నయీం మరణం తర్వాత అక్కడ దొరికిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. సిట్ అధికారిగా నాగిరెడ్డి ఉన్నారన్నారు. పేదల భూములు నయీం లాక్కున్నారని.. అవి ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి వీటిపై విచారణ జరిపితే ఆ భూములను పేద ప్రజలకు ఇవ్వొచ్చని సూచించారు. నయీం డబ్బులు ఏమయ్యాయో ఎవరు చెప్పలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌ను ప్రభుత్వం ఎలా సీరియస్‌గా తీసుకుందో .. నయీం డబ్బులు, ఆస్తులు ఏమయాయ్యో విచారణ జరపాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డిని ఇటీవల కలిశానని.. ఖమ్మం లోక్‌సభ సీటు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాజీవ్ గాంధీతో అక్కడే తిరిగానని గుర్తుచేశారు. ఖమ్మం టికెట్ తనకిస్తే మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఉంటానని వీహెచ్ స్పష్టం చేశారు.






కథల రచయితలకు ఆహ్వానం
గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## గెలిచింది ఎవరు?

ఇద్దరి మధ్య ఇప్పటి వరకు ఎలాంటి గొడవలు లేవు, కానీ ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకోలేక పోతున్నారు. నిన్నటి వరకు చాలా బాగున్న వారి స్నేహంలో చిన్న తగాదా పెద్ద మార్పును తీసుకొని వచ్చింది.

రోజు లాగే ఇద్దరు కలసి వ్యాపార లావాదేవీలకు సంభందించిన లెక్కలు చూసుకుంటున్నారు.అందులో ఒకచోట రమణ రాసిన పద్దులో కొన్ని మార్పులు కనపడ్డాయి, “ఇది ఎందుకు ఇలా రాసావు?” అన్నాడు రాము.”ఇది నా రాత కాదు , ఒకసారి సరిచుస్తా” అని చెప్పి చేతికి తీసుకొని సరిచేసి ఉంచాడు.

దీన్ని గమనించిన అక్కడి ఉద్యోగి తన స్వలాభం కోసం రాము దగ్గరికి వెళ్ళి “ మీరు చూడబట్టి సరిపోయింది , ఇలాంటివి ఇన్ని సంవత్సరాలలో ఎన్ని జరిగాయో కదా !”అంటూ అనుమాన బీజం వేసాడు.

అక్కడితో ఆగకుండా కాసేపటికి రమణ దగ్గరకి వెళ్లి “ఇన్నాళ్ళు మీరు చేసిన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరులాగా మారింది, మీరేమో ఇలా రాత్రింబవళ్ళు పని చేసి ఆయనకు లాభాలు తెచ్చి పెట్టీ ఇలా ఒక్కటి అర తప్పుకు మాట పడాల్సి వస్తోంది, ఇది ఎందుకో నాకు నచ్చలేదు “అన్నాడు.



దీనిపై ఇద్దరి మధ్య కాస్త అగాథం ఏర్పడింది. ఒక సందర్భంలో వ్యాపార విషయంపై జమాలెక్కలు తేడావచ్చి వేరొక కంపెనీ వారికి సమాధానం చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది.దీంట్లో నీది తప్పు అంటే, కాదు ఇన్నాళ్ళు నువ్వుకూడా చూస్తున్నావు కదా నీది మాత్రం లేదా తప్పు అంటూ ఒకరిపై ఒకరు వాదనలు పెంచుకున్నారు.

ఎలాగోలా ఇద్దరు కలసి ఎదుటి వారి వద్ద గౌరవంగా తమ తప్పు లేదని నిరూపించుకొని వారి వ్యాపార నమ్మకాన్ని నిలబెట్టుకున్నరు.ఆ మరుసటి రోజు ఇద్దరు కలసి ఎవరితో చెప్పకుండా , తాము ఎక్కడికి వెళ్తున్నామో ఎవరికీ తెలియ కుండా వెల్లివచ్చరు.

మరుసటి రోజు ఇద్దరి ప్రవర్తనలో చాలా మంచి మార్పు కనపడింది. మునుపటి వలె ఇద్దరు చాలా కలగొలుపుగా ఉండటం గమనించిన అందరూ చాలా సంతోషించారు.

ఇంతలో అప్పుడు ఇద్దరి మధ్య తంటాలు పెట్టిన ఉద్యోగి రాము వద్దకు వచ్చి “ఏమైంది సార్, ఇద్దరు చాలా రోజుల తరువాత అందంగా కనపడుతున్నారు. ఇంతకీ ఎవరు గెలిచారు ?” అన్నాడు.

“మా స్నేహం గెలిచింది” అన్నాడు రాము.అర్థం కాక చూస్తున్న ఆ ఉద్యోగికి “ మేము ఎంతో కాలం నుండి కలసి వ్యాపారం చేస్తున్నాము, దీనికన్నా ముందు మేము మంచి స్నేహితులము , మేము ఇటీవల కొంత చెప్పుడు మాటలకు ఒకరిపై ఒకరు కాస్త అనుమానం పెంచుకున్నాం, కానీ నిన్న మేము ఒకరికొరం కాసేపు మాట్లాడుకున్నాక అర్థమైంది , మేము పొట్లడుకొని ఓడిపోతే ఓడేది మేము కాదు మా స్నేహం అని, అదే గెలిస్తే ఆ గెలుపు కూడా స్నేహానిదే “అని అన్నాడు.

దీంతో వారి మధ్య గల స్నేహం బంధం తెలుసుకున్నారు అందరు.

**-సింగంపల్లి శేష సాయి కుమార్, రాజంపేట, 8639635907**

కవులకు గమనిక
ప్రజా మంటలు
ఇవి ఎన్ని"కల" రోజులు.
కవులు సమాజాన్ని కదిలించాలి. అందుకే,
ప్రజలను చైతన్యవంతం చేసే కవితలను
ఆహ్వానిస్తున్నాం.
మీ కవితలు ఎన్నికల అంశానికే పరిమితమై
సామాజిక అంశాలాను స్పృశిస్తూ,
10-15 లైన్లకు మించకుండా
ఈ కింది ఈమైల్ కు పంపండి.
mantalukathalu@gmail.com
వీటిని ప్రతిరోజు "ప్రజా మంటలు"
తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రచురిస్తాం.
-ఎడిటర్

# ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టండి

## గల్ఫ్ కార్మికులు ఏకం కావాలి

## ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి ని గెలిపించాలి

## టీపీసీసీఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా పిలుపు



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నించే గొంతు ను పార్లమెంట్ కు పంపాలని గ్రామాల్లో పర్యటిస్తూ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ని గెలిపించాలని గ్రామాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ గల్ఫ్ కార్మికులకు అండగా నిలుస్తుంది.



**గల్ఫ్ డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరణ:**
నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా మంగళ వారం ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, వర్షకొండ గ్రామాలతో పాటు, నిజామాబాద్ జిల్లా గుమ్మిర్యాల్, తాల్ల రాంపూర్, ఏర్గట్ల మండలం తోర్తి గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డీ కి మద్దతుగా ప్రచారం చేశారు. గల్ఫ్ బాధితులతో కలిసి టీపీసీసీఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా ఎన్ ఆర్ ఐ డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ.... గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రు.5 లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు జీవన్ రెడ్డి కాంగ్రెస్ మేనిఫెస్టో లో చేర్పించారని అన్నారు. ప్రవాసి భారతీయ భీమా పథకం పరిహారం 10 లక్షల నుండి 25 లక్షలు పెంచుతమని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. గల్ఫ్ కార్మికుల పక్షాన తెలంగాణ తొలి శాసన సభ సమావేశాల్లో సైతం గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని గళం విప్పిన జీవన్ రెడ్డి కి మద్దతు ఇవ్వాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డి కి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. గత పదేళ్ళలో బీ అర్ ఎస్, బిజెపి ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను చిన్న చూపు చూశాయని, గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని మోసం చేశాయని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డీ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్ ఆర్ ఐ పాలసీ అమలు చేస్తుందని భరోసానిచ్చారు. గల్ఫ్ దేశాలలో పాటు ఇత దేశాలు లిబియా, మలేషియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సౌత్ ఆఫ్రికా, రష్యా, బ్యాంకాక్, థాయిలాండ్, దేశాల నుండి తిరిగి వచ్చిన కార్మికులు ఏకమై కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 17 ఎంపి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఎం పి అభ్యర్థులను గెలిపించి, రాహుల్ గాంధీ నీ ప్రధానిగా చేయడంలో గల్ఫ్ కార్మికులు భాగస్వాములు కావాలని టీపీసీసీఎన్ఆర్ ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా 9949321330 పిలుపునిచ్చారు.



జగిత్యాల మున్సిపల్ కార్మికుడు శ్రీహరి అనారోగ్యంతో హాస్పిటల్ లో ఉండగా హాస్పిటల్ కి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వ వర్ధంతి, ఘన నివాళులు



ఇల్లందకుంట ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
మండల అధ్యక్షుడు మోటపోతుల దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి ఘనంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గారికి పూల మాల వేసి పండ్లు పంపిణీ చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బుర్ర నర్సయ్య గౌడ్, పైడిపల్లి వీరస్వామి గౌడ మొత్కూరి శ్రీనివాస్ గౌడ్, ఇల్లందకుంట అధ్యక్షుడు రావుల శివకుమార్ గౌడ్, మోటపోతుల రాము గౌడ్ , సిరిసేడు గ్రామ అధ్యక్షుడు దేశిని మహేష్ గౌడ్, పరకాల తరుపతి గౌడ్, మల్యాల గ్రామ అధ్యక్షుడు ఆరెల్లి తిరుపతి గౌడ్, తోడేటి జితేందర్ గౌడ్, తోడేటి అనిల్ గౌడ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్న

### గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపెల్లి రమేష్ గౌడ్



హుజూరాబాద్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళ పెల్లి రమేష్ గౌడ్ అన్నారు. గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ క్రాస్ రోడ్డులోని సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ...బడుగు బలహీన వర్గాల కోసం సర్వాయి పాపన్న చేసిన పోరాటం మరువలేనిదన్నారు. పేద కుటుంబంలో పుట్టి దేశం గర్వించదగ్గ వ్యక్తిగా పేరు ప్రతిష్టలు సంపాదించారని కొనియాడారు. సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు చింత శ్రీనివాస్, భీమగోని సురేష్, గౌడ సంఘం నాయకులు పంజాల రాంశంకరౌడ్, పెరుమాండ్ల సదానందం, బొనగాని కుమార్, ఎల్లయ్య, కెక్కర్ల సారయ్య, పంజాల శ్రీధర్, అనపురం తిరుపతి, దాసరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు నకిలీ నక్సలైట్ల అరెస్ట్


## - పలు హాస్పిటల్లకు మావోల పేరిట బెదిరింపు లేఖలు




హన్మకొండ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):
జిల్లాలో నక్సల్ పేరుతో బెదిరింపులు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ నక్సలైట్లను హనుమకొండ, సిసిఎస్ పోలీసులు సంయుక్తముగా అరెస్ట్ చేసారు. ఈ అరెస్ట్ కు సంబంధించి హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాలను వెల్లడిస్తూ గత నాలుగు రోజుల క్రితం భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ సిపిఐ మావోయిస్ట్ కమెండర్ దేవన్న పేరున గుర్తు తెలియని వ్యక్తి ఎస్ఎస్ఆర్ గ్రూప్ వారికి, హజార హాస్పిటల్ మరియు దీపక్ స్కిన్ క్లినిక్ హాస్పటల్ లకు బెదిరింపు లేఖలు ఇచ్చి బెదిరింపులకు దిగినట్లు తెలిపారు. లేఖల్లో పాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, రోగుల ప్రాణాలతో తో చెలగాటం ఆడుతూ, డబ్బులు అధిక మొత్తంలో దోచుకుంటున్నారని అందుకు ఎస్ఎస్ఆర్ గ్రూప్ హాస్పటల్ వారి ఆస్తుల వివరాలు మరియు భూమి పత్రాలు, హాస్పిటల్ లైసెన్సు చూపెట్టాలని లేని పక్షంలో డబ్బులు పట్టుకొని చర్చకు రావాల్సిందిగా తెలిపినట్లు, ఈ విషయాన్ని పోలీసు వారికి తెలియపరచినచో ఈడి, సిబిఐ వారికి పట్టిస్తామని లేకుంటే మా నక్సలైట్ చేతిలో చచ్చిపోతారని బెదిరించడంతో ఎస్ఎస్ఆర్ గ్రూప్, హాస్పిటల్ వారు వారి వారి పోలీస్ స్టేషన్ పరిదిలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీస్ వారు దర్యాప్తు చేయగా, మంగళవారం రోజు ములుగు రోడ్డు లో ఉన్న హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాల తనికి చేస్తుండగా నిందితులు పట్టుబడి నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. కాగా నేరస్థుల పేర్లు నల్లబెల్లి కి చెందిన దాసరి శ్రీకాంత్, కరీమాబాద్, వరంగల్ చెందిన బాలిని మహేష్, గా తెలిపారు. వీరి స్మార్ట్ ఫోన్లు, మావోయిస్ట్ పేరున ఉన్న ఖాళీ లెటర్ ప్యాడ్ పత్రాలు లెటర్ ప్యాడ్లు మోటార్ సైకిల్ హెచ్పిసిపియు మొదలగునవి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నుండి స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు. ప్రజలను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడుతూ ఇలాంటి బెదిరింపులు వచ్చినప్పుడు భయపడకుండా నేరుగా పోలీస్ వారిని సంప్రదించినచో వారిని పట్టుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ అబ్బయ్య, పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

# మామిడి లో సస్య రక్షణ పద్ధతులు



గొల్లపల్లి ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతు వేదికల నుండి రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడే కార్యక్రమం మంగళవారం గొల్లపల్లి రైతు వేదిక లో సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు వ్యవసాయ విశ్వవిద్యాలయం సైంటిస్ట్ లు సమగ్ర పోషక యాజమాన్యం మామిడి లో సస్య రక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించి వారి యొక్క సందేహాలు గూర్చి తెలిపారు. ఈ కార్యక్రమములో ఏడీఏ. సి.హెచ్. రామ్ చందర్, ఎఇ కరుణ, ఏఇఒ అశ్విని, గంగాధర్, వంశీ, అలేఖ్య, శ్రీహరి, రైతులు నల్లా సతీశ్ రెడ్డి, గురజాల బుచ్చిరెడ్డి, అందే శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సి.ఎం.రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ చేరాము

వేలేరు ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
హనుమకొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు.

**డాక్టర్ కడియం కావ్య కామెంట్స్....**
కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించినదుకు కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ గారికి, రాహుల్ గాంధీ గారికి, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారికి, ఏఐసిసి ఇంచార్జ్ దీపా దాస్ గారికి, సీఎం రేవంత్ రెడ్డి గారికి అందరికి కృతజ్ఞతలు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి గా ప్రకటించినదుకు ధన్యవాదములు. మా నాన్న పేరు నిలబెట్టే విధంగా పని చేస్తాను. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలునిండు మనసుతో ఆశీర్వాంచాలని కోరుకుంటున్నాను.

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి కామెంట్స్..**
కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం మేరకు ఏఐసీసీ, పిసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టులో చేరడం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి గా పోటీ చేయడానికి అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధినేతలకు కృతజ్ఞతలు. మా పైన నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చినందుకు, నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మాకు వచ్చిన అవకాశన్ని ఉపయోగించుకుంటాం. కాంగ్రెస్ పార్టీ లో చేరడానికి అనేక కారణాలు ఉన్నాయి. గత పెద్దేళ్ళుగా బీజేపీ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. దేశంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.
దళితులపై, మహిళలపై దాడులు పెరిగాయి. మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేదు. లౌకికవాదాన్ని రాజ్యాంగం నుండి తొలగించాలని చూస్తున్నారు. ప్రజా స్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం లను సిబిఐ,ఈడీ కేసులను ఉపయోగించుకొని కూలదొస్తుంది. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి పై సిబిఐ కేసు ఉంటే బీజేపీ లో చేరగానే పోతాయి. డబుల్ ఇంజన్ ఉన్న రాష్ట్ర లలో దళితులు, ముస్లిం వర్గాల పై దాడులు జరుగుతున్నాయి. మణిపూర్ సంఘటన ఒక ఉదాహరణ. ఎన్నికలలో 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని ఎత్తివేస్తా అని, రిజర్వేషన్ లను ఎత్తి వేస్తాం అంటున్నారు.



**మైనార్టీలపై బీజేపీ అక్రుత్యాలను అడ్డుకోవలసి ఉంది.**
**బీజేపీ ని అడ్డుకునే శక్తి ఒక కాంగ్రెస్ పార్టీ కే ఉంది.**
ఒక అంబేద్కర్ వాదిగా రిజర్వేషన్ లు పది కాలాలు పాటు ఉండాలని కాంగ్రెస్ పార్టులో చేరడం జరిగింది. తెలంగాణ శాసనసభ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచింది. ఘనపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది అని నన్ను ప్రజలు గెలిపించారు. ప్రతి పక్షంలో ఉన్నందుకు ఆవేదన ఉండే. దేవదుల ప్రాజెక్ట్ అభివృద్ధి చేయవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సహకారం తీసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. బీఆర్ఎస్ పార్టీని విడినందుకు బాధగా ఉంది. నాకు అవకాశం కల్పించిన కెసిఆర్ కు ధన్యవాదములు. అనేక మంది పార్టీలు మారారు. కానీ నా విషయంలో విపరీత దొరనితో మాట్లాడుతున్నారు. నిన్నటివరకు వారితోనే ఉన్న నేను వారి లాగా దిగజారి మాట్లాడను. దయాకర్ రావు మాట్లాడుతూ కెసిఆర్ కుమార్తెకు మూడో స్థానం వస్తుంది అని మాట్లాడుతూన్నాడు ఎం మాట్లాడాలో తెలియడం లేదు. పాలకుర్తి నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి చేసి ని మనుమరాలు వయసు ఉన్న అమ్మాయి చేతిలో ఓడిపోయావు. సిగ్గు అనిపిస్తలేదా నీకు. పల్లా రాజేశ్వర్ రెడ్డి నిప్పు తొక్కిన కోతిలా ఎగురుతున్నాడు. కెసిఆర్ ఈ దుస్థికి రావడానికి పల్లా లాంటి వాళ్లే కారణం. పల్లాను నా చేసిన ఆరోపణలు ఆధారాలతో బయట పెట్టాలి. లేకపోతే జనగామ చౌరస్తా లో బట్టలు ఊడదీసి నిలపెడుతాం. పార్టీ నుండి డబ్బులు తెచ్చుకున్న అని దుష్ప్రచారం చేస్తున్నారు. నేను సవాల్ చేస్తున్న మీరు నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా. మీ అందరి చరిత్రలు తెలుసు నేను బయట పెడితే తిరగలేరు కానీ నేను బయటపెట్టను. మీలాగా అక్రమంగా సంపాదించిన ఆస్తులను చూపేడితే ప్రభుత్వానికి రాసి ఇస్తా. ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడటం మంచిది కాదు. మంద కృష్ణ మాదిగ వ్యక్తి గత విమర్శలు చేస్తున్నాడు. ప్రతి సందర్భంలో దండోరా ఉద్యమంలో నేను ఉన్న.

**నేను లేకుండా దండోరా ఉద్యమం లేదు.**
**మంద కృష్ణ మాదిగ లేడు.**
రాజ్యాంగ ఫలాలు అందరికి అందాలని నేను కోరుకుంటా. మంద కృష్ణ తప్పుడు నిర్ణయాల వల్ల ఎం.ఆర్.పి.ఎస్. పది ముక్కలు అయింది. దండోరా ముసుగు తీసి బీజేపీ కి ఓటు అడగాలి. 2014లో నేను ఎంపీ గా పోటీ చేస్తే వర్ధన్నపేట నుండి నాకు లక్ష ముప్పై వేల ఓట్లు వస్తే ఈ నాయకుడికి 18వేల ఓట్లు వచ్చాయి. మాదిగ ఉపకులాలకు సపోర్ట్ చేస్తా అన్నావు మాది కూడా ఉపకులమే కదా..

నేను ఎవరి అవకాశాలను అందిపుచ్చుకోలే
అవకాశాలు నన్ను వెతుకుంటూ వస్తున్నాయి.
నాకు కలసి వచ్చిన అవకాశాలను, అందిపుచ్చుకొని ప్రజలకు ఉపయోగపడుతున్న. పార్టీ నిర్మాణం మీద దృష్టి పెట్టలేదు అని నేను ఎప్పుడో చెప్పాను.. ఇప్పుడు ఆలోచిస్తున్నారు. రాష్ట్రంలో ప్రమాదకరంగా బీజేపీ బలపడుతుంది. బిఆర్ఎస్ బలం కోల్పోతుంది. తెలంగాణలో బీజేపీ బలపడితే మతోన్మాదం పెరుగుతుంది. దళితులపై దాడులు చేస్తూ, హాత్యలు చేస్తూ, ముస్లిం మైనార్టీలను టెర్రరిస్ట్ లాగా చూపిస్తూ.. బీజేపీ కి ఓటు వేయాలని ఎలా చెపుతావు. ఎస్సి వర్గీకరణ ఒక ఆర్డినేన్స్ ద్వారా అమలు చేయవచ్చు కదా. ఎందుకు చేయలేదు. రాబోయే రోజులలో దళిత సమాజం మర్చిపోదు. రాజకీయంగా ఇది నా చివరి ఎన్నికలు. రాజకీయాలలో నీతిగా నిజాయితీ గా ఉన్నాను. నిండు మనస్సుతో డాక్టర్ కడియం కావ్య ను దీవించాలని కోరుకుంటున్నాను.



# ప్రైవేటు, పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

## ఎం.ఈ.ఒ. కు ఏబీవీపీ నాయకుల వినతి పత్రం

మెట్ పల్లి ఏప్రిల్ 02 (ప్రజామంటలు):
పట్టణంలోని ప్రైవేటు, పాఠశాలల ఫీజుల దోపిడీనిఅరికట్టాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు మెట్ పల్లి నగర కార్యదర్శి మాట్లాడుతూ.... మెట్ పల్లి లోని ప్రైవేటు, పాఠశాలలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి అభి వెంకట్ కార్యవర్గ సభ్యులు జావేద్, శ్రీవంశి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మల్యాల సీఐ గా నియమితులైన నీలం రవి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించిన కొడిమ్యాల మండలం చెందిన దళిత నాయకులు ఎలగుర్తి రవీందర్, పార్లపల్లి ప్రభుదాస్, నేరెళ్ల మహేష్, భువనగిరి లక్ష్మీనరసయ్య, నరేందర్ తదితరులు

# సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సిపి

**హనుమకొండ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం రోజు ప్రారంభించారు. రోజు రోజుకి పెరిగి పోతున్న సైబర్ నేరాలను నియంత్రించేందుకు గాను తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధ్వర్యంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఎర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి ముందుగా సైబర్ పోలీస్ క్రైమ్ పోలీస్ స్టేషన్ అవరణలో పండ్ల మొక్కను నాటారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులతో కల్సి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన అనంతరం సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన తప్పనిసరిగా వుండాలని, సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడవద్దని, అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో తమ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం, అలాగే మీ సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయడం లాంటివి చేయవద్దని. ఇకపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరానికి సంబంధించి సైబర్ నేరగాళ్ళ చేతిలో ఏవరు మోసపోయిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లోను ఫిర్యాదు చేయవచ్చుని. ముఖ్యంగా సైబర్ బాధితులు సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని. నూతనం ఏర్పాటు చేసిన ఈ పోలీస్ స్టేషన్ నందు ఒక ఏసిపితో పాటు ఒక ఇన్స్‌స్పెక్టర్, ఇద్దరు చోప్పున ఎస్.ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఎనిమిది మంది కానిస్టేబుళ్ళు సైబర్ నియంత్రణతో పాటు,దర్యాప్తు విధులు నిర్వహిస్తారని సీపీ తెలియజేసారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌తో పాటు సిమ్ కార్డులను అందజేసారు. ఈ కార్యక్రమములో డిసిపిలు రవీందర్, అబ్దుల్‌బారీ, ట్రైనీ ఐపిఎస్ అధికారులు, అంకిత్, శుభంనాగ్, అదనపు డిసిపిలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ ఏసిపి కూజ విజయ్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్‌తో పాటు ఇతర విభాగాలకు చెందిన ఎసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐ. లు, సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐలు, సిబ్బంది పాల్గోన్నారు.





# జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

## ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్



**జగిత్యాల ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (ఏప్రిల్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు . శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

**జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువులో 7 గురు విద్యార్థులు ఈతకు వెళ్లగా ఉమా మహేశ్ అనే విద్యార్థి (16) నీటిలో మునిగి మృతి. పట్టణం లోని నాగేంద్రనగర్‌కు చెందిన ఉమా మహేశ్‌గా గుర్తింపు. మృత దేహాన్ని బయటకు తీసిన మత్స్యకారులు.**



# ఎండదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## వేసవికాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**జగిత్యాల ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రం లోని మోతే వాడ తిప్పన్న పేట పట్టణ ప్రాథమిక కేంద్రాల లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య అధికారి సంబంధించిన అధికారులు ఎండ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల సూచించే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ..... ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, మద్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు తెలిపారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాలలో పిల్లలు పెంపుడు జంతువులను వదల వద్దని, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వంట నివారించాలని, ఎండలలో పనిచేయవద్దని ఆల్కహాల్ ,టీ, కాఫీ, స్వీట్స్ చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని , చెప్పులు లేకుండా బయట నడవవద్దని అన్నారు. అలాగే చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడ నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు లేదా టోపిని దరించాలని, ద్వి చక్రవాహనాల పై సుదూర ప్రయాణాలు చేయకూడదని సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడు కోవచ్చున్నారు. చర్మం పై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం లాంటివి చర్మం పై వస్తున్న మార్పులను గమనించాలని, అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108 కు ఫోన్ చేసి చికిత్స, అవసరమైన మందులు పొందాలని, అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ఈ వేసవి కాలంలో జాగ్రత్తలు పాటిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సంబంధిత అధికారులు ఎమ్మార్వో వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్కతుర్తిలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజుకుమార్

**ఎల్కతుర్తి ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలో బస్టాండ్ కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేసిన ఎస్సై గోదారి రాజు కుమార్ వాహనాలు తనిఖీ చేస్తూ ఆర్సీ కార్డులు ఇన్సూరెన్స్ లైసెన్సు పొల్యూషన్ అన్ని సరిగ్గా చూసుకోవాలని వాహనాదారులకు తెలిపారు ఎలక్షన్ సందర్భంగా ఎలాంటి డబ్బులు కానీ మద్యం కానీ తీసుకు వెళ్లరాదని తెలిపారు. ఈ వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ విటల్ రావు కృష్ణ ప్రసాద్ బక్కయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటల్లో తనిఖీలు

**హన్మకొండ ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు డిప్యూటీ డిఎంహెచ్వో డా. గోపాల్ రావు బృందం ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని మాధవ హాస్పిటల్, విబి హాస్పిటల్, సన్ షైన్ హాస్పిటల్స్ లను తనిఖీలు చేశారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ.... జిల్లాలో ప్రైవేట్ హాస్పిటల్, స్కానింగ్ సెంటర్స్ ల్యాబ్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని అనుమతి పొందిన తర్వాతనే నిర్వహించుకోవాలని, ఎవరైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, అనవసరమైన అబార్షన్లు చేసినా, సి-సెక్షన్ ఆపరేషన్లు చేసినవారిపైన చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపినారు. ప్రైవేటు ఆసుపత్రిని నిర్వహించాలంటే తెలంగాణ ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం అన్ని అనుమతులు పొంది ఉండాలని, రిజిస్ట్రేషన్ అనుమతులు పొందకుండా నిర్వహించినట్లయితే వారి హాస్పిటల్ సీజ్ చేసి చట్ట ప్రకారము చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు, ఎల్.డి కంప్యూటర్స్ వెంకటేశ్వర్లు, నాగరాజులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో పోలీసులు పట్టుకున్న

# గంజాయి మాయం

**వేలేరు ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు గతేడాది ఫిబ్రవరిలో ఓ అంబులెన్స్‌లో దాదాపు 70 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్ లో ఉంచగా ఆ గంజాయిని దుండగులు ఎత్తుకెళ్లారు. అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి ఎత్తుకెళ్లినట్టు గుర్తించిన పోలీసులు సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో గంజాయి మాయం సంఘటనను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్ గా తీసుకున్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి



**రాయికల్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జర్నలిస్టుల సమస్యల కోసం ఎంపీ అరవింద్ దృష్టి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని భోగ శ్రావణి తెలిపారు. భోగ శ్రావణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరాటంలో అలుపెరుగని శ్రామికులు జర్నలిస్టులని, సమాజ సేవలో మీడియా పాత్ర అనిర్వచనియమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ జేఏసీ కార్యాలయంలో జర్నలిస్టులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల ప్రెస్ క్లబ్ జేఏసీ నూతన కమిటీ సభ్యులను ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ,ప్రజా సమస్యలపై నిరంతరం తమ కలంతో గన్ను లాగా ఎక్కుపెట్టి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఏకైక కలం వీరులు జర్నలిస్టులని, వారి సేవలు అభినందనీయం అన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి,ప్రజా శ్రేయస్సు కోసం అధికారులను, ప్రభుత్వాన్ని అప్రమత్త చేస్తూ పోరాడిన యోధులు జర్నలిస్టులను ఆమె అన్నారు. పార్టీలకతీతంగా పాత్రికేయ పరస్పర సహకారంతో నడిచినప్పుడే సమాజ శ్రేయస్సు కలుగుతుందని ఆమె అన్నారు. మండల పాత్రికేయుల సహకారం తమపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఎంపీ అరవిందు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షులు వాసవి రవి ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, ఉపాధ్యక్షులు చింతకుంట సాయికుమార్,సాంస్కృతిక కార్యదర్శి ఎద్దండి ముత్యపు రాజు రెడ్డి,నిజనిర్ధారణ కమిటీ సభ్యులు సింగిడి శంకరయ్య, రసూల్,శ్యాంసుందర్,పాత్రికేయులు లింబాద్రిగౌడ్, ప్రవీణ్, జితేందర్, మహేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, సీనియర్ నాయకులు కురుమ మల్లారెడ్డి, కుంబోజి రవి, సామల్ల సతీష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈత తాటి వనం దగ్ధం

## ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

**జగిత్యాల రూరల్ ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ కండ్ల పెల్లి హనుమాజీపేట గీతా కార్మికుల సొసైటీలో 18 మంది సభ్యులు హరితహారం లో భాగంగా ఈత తాటి మొక్కలను పెంచారు దీనికిగాను ప్రభుత్వం నుండి ఎలాంటి నీటి సరఫరా, విద్యుత్తు సౌకర్యాలు కల్పించకున్న తమ సొంత ఖర్చులతో ఈ వనాన్ని పెంచుకున్నామని గీత కార్మికులు తెలిపారు. ఇదిలా ఉండగా అజ్ఞాత వ్యక్తులు తమ ఈత, తాటి వనాన్ని దగ్ధం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.



# మల్యాల ఎంపిపి పై నెగ్గిన అవిశ్వాసం

**మల్యాల ఏప్రిల్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమల పై పలువురు ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఎంపీపీ హాల్ లో ఆర్డిఓ పి మధుసూదన్ గౌడ్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మొత్తం 14 మంది గాను 9 మంది హాజరు అయ్యారు. అవిశ్వాసం పెట్టిన సభ్యులు హాజరు కావడంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఆర్ఐ తిరుపతి పాల్గొనగా మల్యాల ఎస్ఐ కుమారస్వామి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

## మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సీరియస్ - కోర్టుకు వెళతానని హెచ్చరించిన కెటిఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతోనే తమ ఫోన్‌లను ట్యాపింగ్ చేశారంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనం రేపుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వార్తలపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అవసరమైతే కోర్టుకు వెళ్తానంటూ హెచ్చరించారు. నాపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు, మంత్రి కొండా సురేఖ పై కోర్టుకు వెళ్తానని అన్నారు. న్యాయపరంగా నాపై చేస్తున్న అబద్ధపు ఆరోపణలు ఎదుర్కొంటానని తెలిపారు. నిరాధారమైన, మతిలేని ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ, కేకే మహేందర్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లీగల్ నోటీసులు.. పరువు నష్టం దావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాస్తవాలను సరి చూసుకోకుండా... ఇలాంటి వార్తలను ప్రచురించే మీడియా సంస్థలకు కూడా లీగల్ నోటీసులు పంపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపుతుందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో తవ్వే కొద్దే అనేక సంచనల విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మరో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ అయ్యారు. అలాగే ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌పై కేసు నమోదైన వెంటనే ఆయన అమెరికా వెళ్లిపోయారు. ప్రభాకర్ ఆదేశాల మేరకే హార్డ్ డిస్కులను ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం వాటిని రికవరీ చేసిన పోలీసులు.. డిస్కుల నుంచి సమాచారాన్ని రిట్రీవ్ చేసే పనిలో పడ్డారు. మరోవైపు ప్రణీత్ రావుతో పాటు మాజీ అధికారి రాధాకిషన్ రావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో కేటీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలవరాన్ని రేపుతున్నాయి. అవి నిరాధారమైన ఆరోణలని కేటీఆర్ చెప్పినప్పటికీ ఈ వ్యవహారనికి సంబంధించి పార్టీ అధినేత కేసీఆర్ నుంచి ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

## రాష్ట్రంలో బి టాక్స్ వసూళ్లు: బిజెపి ఎమ్మెల్యే



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):**
కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడు తున్నదని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బిల్లుల క్లియరెన్స్ కోసం బీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. బీ ట్యాక్స్ పేరుతో 8 నుంచి 9 శాతం కమిషన్ తీసుకుంటున్నారని విమర్శించారు. బీ ట్యాక్స్ అంటే భట్టి ట్యాక్స్ ఏమో నాకు తెలియదన్నారు. భూ కబ్జాలు చేసిన కేకే, రామ్మోహన్ కాంగ్రెస్‌లో చేరారు. హస్తం పార్టీలో చేరగానే వాళ్లు కడిగిన ముత్యాలు అయ్యారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు.

## సీనియర్ నటుడు విశ్వేశ్వరరావు మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):**
టాలీవుడ్ సీనియర్ నటుడు విశ్వేశ్వరరావు (62) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని చెన్నై సమీపంలోని సిరుశేరులోని నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. బుధవారం నాడు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విశ్వేశ్వరరావు మరణవార్తతో ఇండస్ట్రీ దిగ్భ్రాంతికి గురైంది. కాకినాడలో జన్మించిన విశ్వేశ్వరరావు బాల నటుడిగా కెరీర్ ప్రారంభించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో హాస్యనటుడిగా గుర్తింపు పొందారు. ఆయన కెరీర్‌లో దాదాపు 350కి పైగా చిత్రాల్లో నటించారు. బాలనటుడిగానే 150 చిత్రాల్లో నటించడం విశేషం. సీనియర్ ఎన్టీఆర్, ఎంజీఆర్, చిరంజీవి, రజినీకాంత్, నాగార్జున, పవన్ కళ్యాణ్ ఇలా ఎంతోమంది స్టార్ హీరోలతో ఆయన నటించారు. ఆమె కథ, ముఠా మేస్త్రీ, బిగ్‌బాస్, ప్రెసిడెంట్ గారి పెళ్లాం, ఆయనకు ఇద్దరు, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, మెకానిక్ అల్లుడు, శివపుత్రుడు, శివాజీ వంటి చిత్రాలతో ఆయన గుర్తింపు పొందారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగానూ ఆయన వ్యవహరించారు.విశ్వేశ్వరరావు ఓ యూట్యూబ్ ఛానల్‌ను కూడా రన్ చేస్తున్నారు. విస్సు టాకీష్ పేరుతో నడిపిస్తున్న ఆ యూట్యూబ్ ఛానల్‌లో సినిమాలకు సంబంధించిన పలు విషయాలను ఆయన పంచుకున్నారు. ముగ్గురు ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలితతో తాను పనిచేశానని.. ఇది తనకెంతో గర్వకారణమని ఆయన చెప్పుకునేవారు.


## బిఆర్‌ఎస్‌ను వదలడం బాధగానే ఉంది

**ఇచ్చి అవకాశాలను ఎక్కడా దుర్వినియోగం చేయలేదు**

**ప్రజల కోసం పనిచేయడం మాత్రమే తనకు తెలుసు**

**తనపై అవాకులుచవాకులు పేలేవారిని వదలబోను**

**కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి స్పష్టీకరణ**



**వరంగల్, ఏప్రిల్ 2 (ప్రజా మంటలు):**
బీఆర్ఎస్‌ను వదలడం తనకు బాధగానే ఉందని, ఆ పార్టీ తనకు చాలా అవకాశాలు ఇచ్చిందని, తనకు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేయలేదని మాజీమంత్రి, స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కానీ తనపై ఆ నేతలు విషం కక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్‌లో చేరడాన్ని సమర్థించుకున్నారు. తాను స్థాయి దిగజారి మాట్లాడదలుచు కోలేదని అన్నారు. బీజేపీ ఆకృత్యాలను అడ్డుకోవడం ప్రాంతీయ పార్టీల వల్ల కాదని.. జాతీయ పార్టీతోనే సాధ్యమని.. అందుకే కాంగ్రెస్ పార్టీ లో చేరానని, అలాగే తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారానని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన వరంగల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటిని నాశనం చేస్తోందని విమర్శించారు. దేశంలో ప్రతిపక్షాల నామరూపాలు లేకుండా చేసే విధంగా ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పక్షంగా ఎన్నికైన ప్రభుత్వాలను దొడ్డిదారిన కూలగొట్టి, బెదిరించి, ఈడీ , సీబీఐ కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేస్తోందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న నిందితుడు బీజేపీలో చేరగానే పునీతులైపోతున్నారని.. అంతేకాకుండా దేశంలో ఉన్న ముస్లిం మైనారిటీస్ కు భద్రత లేదన్నారు. అలాగే దేశంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని కడియం శ్రీహరి అన్నారు. 'మీ బలుపు.. మీ అహంకారం మాటలే ఓటమికి కారణం.. అంతా ఓడారు.. నేను ఒక్కడినే గెలిచననే అక్కసుతో మాట్లాడారు.. బీఆర్ఎస్ ఈ దుస్థితికి పల్లా రాజేశ్వర్ రెడ్డే కారణం.. పల్లా ఓ చీడ పురుగు.. రాజేశ్వర్ రెడ్డి దమ్ముంటే నా చరిత్ర ఎన్నికల ముందు బయటపెట్టాలి.. నిరూపించకపోతే నీ బట్టలు ఊడదీసి జనగామ చౌరస్తాలో నిలబెడతా.. నిన్నమొన్నటి వరకు నా చుట్టూ ఉన్నవాళ్ళు ఇప్పుడు విషం కక్కుతున్నారని కడియం శ్రీహరి మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ తనకు ఒక్క రూపాయి ఇచ్చినట్లు నిరూపించినా తన బిడ్డ... తాను పోటీ నుండి తప్పుకుంటానని కడియం శ్రీహరి సవాల్ చేశారు. మీ అందరి బతుకులు తనకు తెలుసునని.. వాటిని బయటపెడితే ఎవరూ బయట తిరగలేరని అన్నారు. తాను అవకాశవాదిని కాదని, అవకాశాలే తనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. తాను లేకుంటే మంద కృష్ణమాదిగ లేరని, ఆర్థికంగా కూడా ఆయనకు సహకారం అందించానని చెప్పారు. బీజేపీకి ఓటు వేయమంటున్న మంద కృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసేసీ బీజేపీ నేతగా ఆ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తే ఎన్ని ఓట్లు వచ్చాయో.. ప్రజలకు తెలుసునని అన్నారు. మంద కృష్ణ మాదిగ స్వార్థం వల్లే ఎమ్మార్పీఎస్ బలహీన పడిందన్నారు. ఏఐసీసీ, పీసీసీ తన అవసరాన్ని గుర్తించి.. వెతుక్కుంటూ వచ్చి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు పార్టీ నిర్మాణంపైన దృష్టి లేదని.. పార్టీని పట్టించుకోవడం లేదని... నష్టం జరుగుతుందని కేసీఆర్‌కు ముందే చెప్పానని అయినా పట్టించు కోలేదని శ్రీహరి అన్నారు. ఇదే నా చివరి ఎన్నిక.. నాది గర్వం కాదు.. ఆత్మాభిమానం.. నన్ను అలా అనుకోవడం మీ అహంకారపు ఆలోచన.. కాంగ్రెస్ పార్టీలో మా చేరిక వల్ల ఆశావహుల్లో అసంతృప్తి ఉంది.. ఎన్నికల సమయంలో ఇలాంటివి కామన్.. బీఆర్ఎస్‌లో ఉండి కేసీఆర్‌కు వెన్ను పోటు పొడవలేకే బయటకు వచ్చాను.. ఎమ్మెల్యే పదవి విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటాను.. పార్టీల పిరాయింపు సంస్కృతి బీఆర్ఎస్‌దే అని కడియం శ్రీహరి వ్యాఖ్యనించారు. తాను ప్రజల కోసమే పార్టీ మారానని , స్వార్థం కాదన్నారు. స్వార్థ రాజకీయాలు చేసివుంటే తన జీవితం మరోలా ఉండేదన్నారు. తాను ఎక్కడ ఉన్నా ప్రజలకోసం పనిచేయడం మాత్రమే తెలుసని అన్నారు.

## కొత్త లుక్స్‌లో మహేశ్ బాబు

### రాజమౌళి సినిమా కోసమేనా అంటూ కామెంట్స్



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సెలబ్రిటీల్లో స్టార్ హీరో మహేశ్ బాబు ఒకరు. తాజాగా ఆయన షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇటీవలే 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన ప్రస్తుతం తదుపరి సినిమా షూట్ కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్టైలిష్ లుక్‌లో ఉన్న ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. వాటిని చూసిన ఫ్యాన్స్ రాజమౌళి సినిమా కోసమేనా ఈ లుక్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. దీంతో ఎస్ఎస్ఎంబి 29 హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. మరోవైపు మహేశ్–రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో వార్త కూడా షేర్ అవుతోంది. దీనికి రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ కథను అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. 'నాకు, రాజమౌళికి దక్షిణాఫ్రికా రచయిత విల్బర్ స్మిత్ నవలలు చాలా ఇష్టం. ఆయన రాసిన చాలా పుస్తకాలు చదివాం. వాటి ఆధారంగా ఈ సినిమా స్క్రిప్ట్‌లో కొన్ని సన్నివేశాలు రాశాం' అని అన్నారు. దీంతో మహేశ్ ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు. యాక్షన్ మూవీ కావడంతో ఈ సినిమాకు ఎక్కువ రోజులు ప్రీ–ప్రొడక్షన్ వర్క్ చేస్తోన్నారు. సినిమా కథకు తగినవిధంగా పాత్రలు, వాటి స్కెచ్‌లను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కథా నేపథ్యానికి సంబంధించిన సెట్స్ డిజైన్ పైనా కసరత్తు చేస్తున్నట్లు టాక్. ఇక ఈ సినిమాలో మహేశ్ ఎనిమిది లుక్స్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వాటికి సంబంధించి స్కెచ్‌లు పూర్తయ్యాయని సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్‌కు 'మహారాజ్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి.గుంటూరు కారం'చిత్రంతో అలరించిన సూపర్‌స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళితో ÷ూఓఃః29 సినిమా చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే మహేష్‌పై ఫొటో షూట్ కూడా జరిగింది. త్వరలో షూటింగ్ మొదలవుతుందని ఇటీవల మహేశ్ ఓ వేదికపై వెల్లడించారు. చిత్రీకరణ కోసం ఎ÷–జగైటింగ్‌గా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. తాజాగా మహేష్ లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.. ట్రెండీ లుక్‌లో మహేష్ ఆకట్టుకుంటు న్నారు. రాజమౌళి సినిమా కోసం మహేష్ వర్కౌట్స్ చేస్తున్నారు. అలాగే రాజమౌళి స్క్రిప్ట్ ÷నైల్ చేయడంతోపాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారు. ఆర్టిస్టులను ఫైనల్ చేసే పనిలో ఉన్నారు.. ఇక రెండు మూడు నెలల్లో షూటింగ్ పనులు మొదలయ్యే అవకాశాలున్నాయి.




## కిరణ్ అబ్బవరంతో హనుమాన్ ఏకర్స్ మూవీ ?

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరంకు ప్రస్తుతం బ్యాడ్ టైం నడుస్తోంది. ఆయన హీరోగా వచ్చిన గత సినిమాలేవి ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. చివరగా ఆయన హీరోగా వచ్చిన మూవీ రూల్స్ రంజన్. తమిళ దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. నిజానికి ఈ సినిమాపై చాలా ఆశలే పెట్టుకున్నాడు కిరణ్ కానీ, రిజల్ట్ మాత్రం మారలేదు. ఈ సినిమా విడుదలై ఆరు నెలలు గడుస్తున్నా మరో సినిమాను ప్రకటించలేదు కిరణ్. అయితే తాజాగా కిరణ్ అబ్బవరం సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హనుమాన్ మేకర్స్ అప్పట్లో కిరణ్ అబ్బవరంతో ఓ పాన్ ఇండియా మూవీ చేస్తున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ప్రీ ఇండిపెండెన్స్ బ్యాక్డ్రాప్ లో రానున్న ఈ సినిమాను భారీ తెరకెక్కించనున్నారు అనే టాక్ నడిచింది. కానీ, ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ సినిమా ఉంటుందా? ఉండదా? అనే అనుమానాలు తలెత్తుతు న్నాయి. ఇక హనుమాన్ మేకర్స్ విషయానికి వస్తే.. ప్రస్తుతం వారి చేతుల్లో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. వాటిలో హనుమాన్ సీక్వెల్ జై హనుమాన్, అధీర సినిమాలు ఉన్నాయి. వీటితోపాటు మెగా హీరో సాయిధరమ్ తేజ్, నితిన్ లతో కూడా వరుస సినిమాలు ప్లాన్ చేస్తున్నారు. దీంతో ఇప్పట్లో కిరణ్ అబ్బవరం సినిమా ఉండకపోవచ్చు అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## గీతగోవిందంలా బ్లాక్‌బ్లస్టర్ కావాలి

**ఫ్యామిలీ స్తార్ మూవీ ప్రీరిలీజ్ వేడుకల్లో దిల్ రాజు**



విజయ్ దేవరకొండ నటిస్తున్న ఫ్యామిలీ స్టార్ సినిమా మరో నాలుగు రోజుల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ , నిర్మాత దిల్ రాజు, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ పాల్గొన్నారు. 'ఫ్యామిలీ స్టార్' సినిమా హైలైట్స్ ఈ కార్యక్రమంలో వివరించారు. ఈ సందర్భంగానిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతి అంశం పాజిటివ్ గా కనిపిస్తోంది. పాటలు, ట్రైలర్ మీరు చూశారు మీ అందరికీ నచ్చింది. అందుకే మీలోనూ ఆ హ్యాపీనెస్ కనిపిస్తోంది. పరశు రామ్ ఈ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎగ్జైట్ చేసింది. స్టోరీని డెవలప్ చేశాక మేమంతా ఇంప్రెస్ అయ్యాం. విజయ్, పరశురామ్ కలిసి గీత గోవిందం లాంటి బ్లాక్ బస్టర్ చేశారు. ఈ సినిమా కూడా వాళ్ల కాంబినేషన్ లో సక్సెస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఫ్యామిలీ స్టార్ కు విజయ్ క్యారెక్టరైజేషన్ వెన్నెముక లాంటిది. విజయ్ నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ꠰÷ట్ చేస్తాడు, ఫ్యామిలీ కోసం ఆలోచిస్తాడు, అమ్మాయిని ప్రేమిస్తాడు, ఆమెను ద్వేషిస్తాడు, రొమాన్స్ చేస్తాడు..ఇలా అన్ని షేడ్స్ హీరో క్యారెక్టర్ లో ఉన్నాయి. విజయ్ ఈ సినిమాలో 360 డిగ్రీస్ క్యారెక్టర్ చేశాడని చెప్పవచ్చు. ఇది కేవలం ఫ్యామిలీ స్టోరీ మాత్రమే కాదు లవ్ స్టోరీ కూడా ఉంటుంది. 30 పర్సెంట్ ఫ్యామిలీ స్టోరీ, 70 పర్సెంట్ లవ్ స్టోరీ ఉంటుంది. మృణాల్ లక్కీ హీరోయిన్. సీతారామం, హాయ్ నాన్న సక్సెస్ తర్వాత ఫ్యామిలీ స్టార్ తో ఆమె హ్యాట్రిక్ అందుకోబోతోంది. దర్శకుడు పరశురామ్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఇప్పుడు కూడా డబ్బింగ్, మిక్సింగ్ వర్క్స్ చేయిస్తున్నాడు. మా సంస్థలో విజయ్ తో తను చేస్తున్న సినిమాను సక్సెస్ చేయాలనే తపన పరశురామ్ లో ఉంది. ఈ సినిమాకు పనిచేసిన టెక్నికల్ టీమ్ కూడా ఎంతో ఇన్వాల్వ్ అయ్యింది. సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్, ఎడిటర్ మార్తాండ్ వెంకటేష్, ఆర్ట్ ఏఎస్ ప్రకాష్, మ్యూజిక్ డైరెక్టర్ గోపీసుందర్..ఇలా వీళ్లంతా తమ బెస్ట్ ఇచ్చారు. మా సంస్థలో ఎన్నో ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ వచ్చాయి. ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ విషయంలో నా గురి తప్పలేదు. ఒక్క శ్రీనివాస కల్యాణం సినిమా మాత్రమే అనుకున్నంత ఫలితం రాలేదు. మన ఇండియన్ కల్చర్ లోనే ఫ్యామిలీ అంటే మనకొక విడదీయని అనుబంధం ఉంటుంది. అలాంటి కుటుంబానికి తను అండగా నిలబడి అభివృద్ధిలోకి తీసుకొచ్చేవారు ఎందరో ఉంటారు. అలాంటి వారంతా ఫ్యామిలీస్టార్స్ అని చెప్పడమే ఈ సినిమా ఉద్దేశం. అమెరికా లాగ మనం పదహారేళ్లకు పిల్లల్ని వారి దారిన వారిని వదిలేయం. రెండు మూడు తరాలు కలిసి ఉంటాయి. ఆ ఫ్యామిలీ వ్యాల్యూస్ ఈ సినిమాలో కనిపిస్తాయి. ఏప్రిల్ 5 నాకు ఎంతో స్పెషల్. ఆ రోజుతో
దిల్ సినిమా రిలీజ్ తో నేను రాజు నుంచి దిల్ రాజు అయ్యాను. అప్పటి నుంచి మొన్నటి బలగం సినిమా వరకు మీరూ, ప్రేక్షకులూ ఎంతో సపోర్ట్ చేశారు. ఆ సపోర్ట్ ఇకపైనా కొనసాగాలి. మీడియా మిత్రులు వారి కుటుంబ సభ్యులతో ఒక గెట్ టు గెదర్ ఏర్పాటు చేస్తున్నాం. అలాగే మీడియా మిత్రుల ఫ్యామిలీస్ కోసం ఫ్యామిలీ స్టార్ స్పెషల్ షో అరేంజ్ చేస్తున్నాం. సినిమా ప్రమోషన్ లో భాగంగా ఎనర్జిటిక్ గా పాటలు పాడుతున్నా, డ్యాన్సులు చేస్తున్నా. అంతేగానీ స్క్రీన్ మీద నటించే ఆలోచన లేదు. విజయ్ హీరోగా మా సంస్థలో ఓ భారీ పాన్ ఇండియా మూవీ ఉంటుంది. దానికి స్క్రిప్ట్ రెడీ అయ్యింది. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కు టైమ్ పట్టేలా ఉంది. అదంతా పూర్తయ్యాక ఆ మూవీ తప్పకుండా సెట్స్ మీదకు తీసుకెళ్తాం. విజయ్ ప్రొడ్యూసర్స్ గురించి ఆలోచించే హీరో. అందుకే అతనితో మరో రెండు సినిమాలు చేయబోతున్నా. అన్నారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ – సీతారామం సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో నాకు ఇంత గొప్ప కెరీర్ ఉంటుందని అనుకోలేదు. సీతారామం తర్వాత హాయ్ నాన్న వంటి మంచి స్క్రిప్ట్ దొరికింది. ఈ రెండు సినిమాల తర్వాత నేను చేసే సినిమాల స్పెషల్ గా ఉండాలని అనుకున్నా. అలాంటి స్పెషల్ స్కిప్ట్ ను పరశురామ్ గారు నెరేట్ చేశారు. గోవర్ధన్, ఇందూ, బామ్మ ఇతర క్యారెక్టర్స్ మధ్య బ్యూటిఫుల్ గా స్టోరీ ఉంటుంది.
హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ..– మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని ధైర్యం చెప్పే పర్సన్ ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో మా నాన్న ఫ్యామిలీ స్టార్. డైరెక్టర్ పరశురామ్ ఈ కథ చెప్పినప్పుడు ఆయన లైఫ్ లోని అనుభవాలను ఊహించుకుంటూ చెప్పాడు. కథ వింటున్నప్పుడు మాత్రం నాకు మా నాన్న గుర్తొచ్చాడు. ఫ్యామిలీ కోసం ఆయన పడిన తపన గుర్తుకువచ్చింది. అందుకే ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ కు గోవర్థన్ అనే పేరు పెట్టమని చెప్పాను. ఎందుకంటే ఆ పేరు పెట్టుకున్న తర్వాత ఎమోషన్స్ పలికించడం సులువు అవుతుంది. ఆయన ఎలా ఫ్యామిలీ కోసం పనిచేసేవారో గుర్తుకువస్తుంటుంది. ఏప్రిల్ 5న ఫ్యామిలీ స్టార్ రిలీజ్ అవుతోంది. ఏప్రిల్ 8న నాన్న బర్త్ డే. ఈ సినిమా విషయంలో ఆయన గర్వపడతారని ఆశిస్తున్నానని అన్నారు.



## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ మహిళా

# క్రికెటర్ ఫరీహా త్రిస్నా



బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ ఫరీహా త్రిస్నా చరిత్ర సృష్టించింది. 2022లో అరంగేట్రం చేసిన త్రిస్నా.. తన కెరీర్‌లో రెండో హ్యాట్రిక్ సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం మిర్పూర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో బంగ్లా బౌలర్ రెండో హ్యాట్రిక్ సాధించింది. 2022లో తన టీ20లో అరంగేట్రంలోనే త్రిస్న హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఫరీహా త్రిస్నా హ్యాట్రిక్ తీసింది. 20వ ఓవర్ చివరి మూడు బంతులకు ఎల్లిస్ పెర్రీ, మోలినెక్స్, బెత్ మూనీలను ఔట్ చేసింది. ఈ మ్యాచులో త్రిస్నా తన కోటా నాలుగు ఓవర్లలో 19 పరుగులిచ్చి.. నాలుగు వికెట్లు పడగొట్టింది. ఇందులో ఓ మెయిడిన్ ఓవర్ కూడా ఉండడం విశేషం. ఈ సంవత్సరం మహిళల క్రికెట్‌లో ఇది ఐదవ హ్యాట్రిక్ కావడం మరో విశేషం. 21 ఏళ్ల త్రిస్నా బంగ్లా తరఫున 5 వన్డేలు, 6 టీ20లు ఆడింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. గ్రేస్ హారిస్ (47), జార్జియా వేర్‌హామ్ (57) రాణించారు. బంగ్లా బౌలర్లలో ఫరీహా త్రిస్నా 4 వికెట్స్ పడగొట్టగా.. నహీద అక్తర్, ఫహీమా ఖాతూన్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ మహిళలు తడబడ్డారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 రన్స్ చేశారు. దిలారా అక్టర్ (27), షోర్నా అక్టర్ (21) పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లు ఆష్లీ గార్డనర్, సోఫీ మోలినెక్స్ తలో మూడు వికెట్స్ పడగొట్టారు.

## రెండు మ్యాచ్‌ల తేదీల్లో మార్పు..



ఐపీఎల్ 17వ సీజన్ రసవత్తరంగా సాగుతోంది సోమవారం (ఏప్రిల్ 1వ తేదీ) వరకు మొత్తం 14 మ్యాచ్‌లు విజయవంతంగా జరిగాయి. ఈ 14 మ్యాచ్‌లలో రాజస్థాన్ రాయల్స్ అత్యంత విజయవంతమైన జట్టుగా, ముంబై ఇండియన్స్ అత్యంత విఫలమైన జట్టుగా నిలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ విజయం సాధించింది. ముంబై హ్యాట్రిక్ పరాజయాలను పూర్తి చేసుకుంది. ఐపీఎల్ 15వ మ్యాచ్ మంగళవారం (ఏప్రిల్ 2) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య జరగనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యమివ్వనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు ఐపీఎల్ పై ఓ పెద్ద అప్‌డేట్ వచ్చింది. 17వ సీజన్ షెడ్యూల్ లో కొన్ని మార్పులు చేసినట్లు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. మొత్తం 2 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ మార్చింది. కోల్‌కతా %జం% రాజస్థాన్ మధ్య మ్యాచ్ ఏప్రిల్ 17న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగాల్సి ఉంది. మారిన షెడ్యూల్ ప్రకారం, ఇప్పుడు మ్యాచ్ ఒక రోజు ముందుగా ఏప్రిల్ 16న జరగనుంది. ఏప్రిల్ 17న నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ %జం% ఢిల్లీ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ మ్యాచ్ ఏప్రిల్ 16న జరగనుంది. ఈ విషయాన్ని ఐపీఎల్ ట్విట్టర్ ద్వారా తెలియజేసింది. ఇదిలా ఉంటే ఏప్రిల్ 17న శ్రీరామ నవమి. ఈ పండుగను దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. కోల్ కతాలో మరింత అట్టహాసంగా వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్ కు పోలీసులు భద్రత కల్పిస్తారా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాగే దేశంలోని ఇతర ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల వాతావరణం ఉంటుంది. దీంతో మ్యాచ్‌ను వాయిదా వేయాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయా ఫ్రాంఛైజీలకు, బ్రాడ్ కాస్టర్లకు సమాచారం అందించింది.

## హార్దిక్ పాండ్యా ఖాతాలో చెత్త రికార్డ్



రాజస్థాన్ రాయల్స్‌పై ఓటమితో హార్దిక్ పాండ్యా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత, హార్దిక్ గతంలో హర్భజన్ సింగ్ పేరిట ఉన్న అవాంఛిత రికార్డును సమం చేశాడు.

మార్చి 24న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై కెప్టెన్‌గా హార్దిక్ ఆరు పరుగుల తేడాతో ఓడిపోయాడు. మార్చి 27న హైదరాబాద్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 31 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. ఐపీఎల్ 2024 మ్యాచ్ నం. 2014లో ముంబై ఇండియన్స్ రాజస్థాన్ రాయల్స్‌తో తలపడింది. సొంతగడ్డపై జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబై ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఈ టోర్నీలో హార్దిక్ పాండ్యా జట్టు హ్యాట్రిక్ ఓటమి చవిచూసింది. ఈ ఓటమితో హార్దిక్ పాండ్యా చెత్త రికార్డును లిఖించాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయిన హార్దిక్.. గతంలో హర్భజన్ సింగ్ పేరిట ఉన్న అవాంఛిత రికార్డును సమం చేశాడు. 17 ఏళ్ల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడిన రెండో కెప్టెన్‌గా నిలిచాడు.మార్చి 24న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై కెప్టెన్‌గా హార్దిక్ ఆరు పరుగుల తేడాతో ఓడిపోయాడు. మార్చి 27న హైదరాబాద్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 31 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది.అంతకుముందు 2008లో ప్రారంభమైన ఐపీఎల్‌లో హర్భజన్ సింగ్ మొదటి మూడు మ్యాచ్‌లలో ముంబై ఇండియన్స్‌కు నాయకత్వం వహించాడు. ఆ సమయంలో %=జదీ%పై ఐదు వికెట్ల తేడాతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై ఆరు పరుగులతో, పంజాబ్ కింగ్స్‌పై 66 పరుగుల తేడాతో ఓడిపోయింది.హర్భజన్ సింగ్ %ఝూ% 2008లో ముంబై ఇండియన్స్‌కు మొదటి కెప్టెన్. ఆ తర్వాత ముంబై జట్టుకు షాన్ పొలాక్, సచిన్ టెండూల్కర్, డ్వేన్ బ్రావో, రికీ పాంటింగ్, రోహిత్ శర్మ, కీరన్ పొలార్డ్, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం హార్దిక్ కెప్టెన్‌గా ఉన్నాడు.సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై జట్టు 125 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్ష్యాన్ని ఛేదించిన రాజస్థాన్ తొలుత 48 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి క్రీజులో నిలిచిన రియాన్ పరాగ్ 39 బంతుల్లో అజేయంగా 54 పరుగులు చేసి రాజస్థాన్‌కు విజయాన్ని అందించాడు.

## ఐపీఎల్ చరిత్రలో ముంబై ఆరోసారి చెత్త రికార్డ్



దీంతో రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడో విజయం సాధించగా, ముంబై ఇండియన్స్ వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. ఈ సీజన్‌లో ముంబై తన తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కోవడం ఇదే తొలిసారి కాదు.

ఇంతకు ముందు చాలా సార్లు అతనికి ఇలా జరిగింది. ఐపీఎల్ తొలి సీజన్‌లో కూడా ముంబై తన తొలి మూడు మ్యాచ్‌ల్లో వరుస పరాజయాలను చవిచూడాల్సి వచ్చింది. %ఝూ% 2024లో ముంబై ఇండియన్స్ పేలవమైన ఫామ్ కొనసాగుతోంది. సొంత మైదానంలో జరిగిన మ్యాచ్‌లోనూ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘోరంగా ఓడిపోయింది.%జ%ఐపీఎల్ 2024 14వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఏకపక్షంగా 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 15.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడో విజయం సాధించగా, ముంబై ఇండియన్స్ వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. ఈ సీజన్‌లో ముంబై తన తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కోవడం ఇదే తొలిసారి కాదు. ఇంతకు ముందు చాలా సార్లు అతనికి ఇలా జరిగింది. ఐపీఎల్ తొలి సీజన్‌లో కూడా ముంబై తన తొలి మూడు మ్యాచ్‌ల్లో వరుస పరాజయాలను చవిచూడాల్సి వచ్చింది. ఆ తర్వాత, 2014 సీజన్‌లో అతనికి ఇది జరిగింది. ఐపీఎల్ 2015, ఐపీఎల్ 2018లో కూడా ముంబై తన మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఐపీఎల్ 2022లో కూడా అతనితో అలాంటిదే జరిగింది. అయితే 2015 సీజన్‌లో తొలి మ్యాచ్‌ల్లో ఓడిపోయినా జట్టు అద్భుతంగా పుంజుకుని టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇటువంటి పరిస్థితిలో, ముంబై ఇండియన్స్ చాలా నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆ జట్టు ఇప్పటికీ పునరాగమనం చేయగలదు.

## ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌కు ఎంఎస్ ధోనీ దూరం!



చెన్నై సూపర్ కింగ్స్, హైదరాబాద్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌లో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ బరిలోకి దిగడం అనుమానమే అని తెలుస్తోంది. ఆదివారం విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ధోనీ నడవడానికి ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌కు మహీకి విశ్రాంతి ఇవ్వనున్నట్లు నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.ఐపీఎల్ 2023లో మోకాలి గాయంతో ఇబ్బందిపడిన ఎంఎస్ ధోనీ.. టోర్నీ అనంతరం శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఐపీఎల్ 2024కు కొన్ని నెలల ముందు ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ఈ సీజన్లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడని ధోనీ.. ఢిల్లీపై చెలరేగాడు. ఈ క్రమంలోనే గాయం తిరగబెట్టినట్లుగా తెలుస్తోంది. ఒకవేళ విశ్రాంతి ఇవ్వకపోతే గాయం తీవ్రత ఎక్కువై లీగ్ మధ్యలో వైదొలగే అవకాశాలు ఉండడంతో.. ధోనీకి ఇప్పుడే విశ్రాంతి ఇవ్వాలని భావిస్తున్నారట. అయితే ఈవిషయంపై సీఎస్‌కే మేనేజ్మెంట్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## ఆర్‌సీబీతో పోలిస్తే పటిష్టంగా ఎల్ఎస్‌జీ



ఐపీఎల్ 2024లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు తలపడనున్నాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయాన్ని మాత్రమే అందుకున్న ఆర్‌సీబీ.. లక్నోపై గెలవాలని చూస్తోంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓ గెలుపు, ఓ ఓటమిని ఎదుర్కొన్న ఎల్ఎస్‌జీ.. మరో విజయాన్ని ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లలో తలపడ్డాయి. మూడు మ్యాచ్‌ల్లో ఆర్‌సీబీ గెలవగా.. ఓ మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ విజయం సాధించింది. చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ 2024 మ్యాచులు రెండు జరగగా.. ఛేదనకు దిగిన జట్టే గెలిచింది. ఇక్కడ బ్యాటర్లు పండగ చేసుకుంటారు. పేసర్లు ఈ వికెట్‌పై ప్రభావం చూపుతారు. స్పిన్నర్లు కూడా సహకారం ఉంటుంది.ఐపీఎల్‌లో ఎల్ఎస్‌జీపై ఆర్‌సీబీకి మంచి ఆధిపత్యం ఉంది. అయితే ప్రస్తుత సీజన్‌లో ఆర్‌సీబీతో పోలిస్తే ఎల్ఎస్‌జీ పటిష్టంగా కనిపిస్తోంది. లక్నోకు మంచి బ్యాటింగ్, బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. డికాక్, రాహుల్, పడిక్కల్, స్టోయినిస్, పూరన్, మయాంక్ యాదవ్, నవీన్ ఉల్ హక్, మొహిసిన్ ఖాన్, రవి భిష్ణోయ్ జట్టులో ఉన్నారు. ఆర్‌సీబీలో డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్, గ్రీన్, సిరాజ్, యశ్ దయాల్, అల్జరీ జోసఫ్‌లు ఉన్నా ఇప్పటివరకు రాణించలేదు. మరి లక్నోతో మ్యాచ్‌లో బెంగళూరు ఏ మేరకు రాణిస్తుందో చూడాలి.

**తుది జట్లు (అంచనా):**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫాఫ్ డు ప్లెసిస్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, కామెరూన్ గ్రీన్, గ్లెన్ మాక్స్‌వెల్, ఆర్ఎమ్ పాటిదార్, దినేష్ కార్తీక్ (కీపర్), అనుజ్ రావత్, ఎంజే డాగర్, విజయ్‌కుమార్ వైషాక్, లాకి ఫెర్గూసన్, మహమ్మద్ సిరాజ్.లక్నో సూపర్ జెయింట్స్: కేఎల్ రాహుల్, క్వింటన్ డికాక్ (కీపర్), దేవదత్ పడిక్కల్, నికోలస్ పూరన్ (కెప్టెన్), మార్కస్ స్టోయినిస్, కృనాల్ పాండ్యా, ఆయుష్ బదోని, రవి బిష్ణోయ్, మొహ్సిన్ ఖాన్, మయాంక్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్.కీపర్ – క్వింటన్ డికాక్, నికోలస్ పూరన్‌బ్యాట్స్‌మెన్ – విరాట్ కోహ్లీ (వైస్ కెప్టెన్), ఫాఫ్ డుప్లెసిస్ (కెప్టెన్), లోకేష్ రాహుల్‌ఆల్ రౌండర్లు – గ్లెన్ మాక్స్‌వెల్, కామెరాన్ గ్రీన్, కృనాల్ పాండ్యా
బౌలర్లు లి మహ్మద్ సిరాజ్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com